మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 41 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



# దేవుడు గుడిలో ఉండాలి..
# భక్తి గుండెల్లో ఉండాలి..



మల్కాజిగిరి, నిజామాబాద్, ఆదిలాబాద్ : ఏప్రిల్ 22 (ప్రజా మంటలు): సెప్టెంబర్ 17లోపు చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటుపై మోదీ ఇచ్చిన ప్రకటనలో ఎక్కడా నిజామాబాద్ పేరు లేదన్నారు. నిజామాబాద్‌లోనే బోర్డు ఏర్పాటు అని స్పష్టంగా చెప్పకుండా నోట్ విడుదల చేశారని విమర్శించారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ మిగతా 2లో..

- దేవుడిపేరుతో మోసం చేస్తున్న బిజెపి
- ఆదిలాబాద్, నిజామాబాద్ పరిశ్రమలను పునరుద్ధరిస్తాం
- చక్కెర కర్మాగారాలను తెరిపించి రైతులను ఆదుకుంటాం
- బిజెపి ప్రకటించిన పసుపుబోర్డుపై స్పష్టత కరవు
- సెప్టెంబర్ 17లోపు ప్రక్రియ పూర్తి చేస్తాం
- తుమ్మిడిహట్టిలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తాం
- మల్కాజిగిరి, నిజామాబాద్, ఆదిలాబాద్ : జనజాతర సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

## బీజేపీ ఖాతాలో తొలి విజయం

- గుజరాత్‌లోని సూరత్ స్థానాన్ని చేజిక్కించుకున్న కమలం - పార్టీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవ ఎన్నిక



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే బీజేపీ ఖాతాలో తొలి విజయ వచ్చి చేరింది. గుజరాత్ లోని సూరత్ స్థానం ఏకగ్రీవం కానుంది. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీకి పోటీగా కాంగ్రెస్ అభ్యర్థి దాఖలు చేసిన నామినేషణ తిరస్కరణకు గురైంది. దీంతో బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సౌరభ్ పార్థి ఆయనకు సర్టిఫికేట్ అందించారు. గుజరాత్ లోని సూరత్ లోక్ సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున నీలేశ్ కుంభనీ ఇటీవలే నామినేషన్ దాఖలు చేశారు. అయితే దాన్ని పరిశీలించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారం ఆదివారం నీలేశ్ కుంభనీ నామినేషన్ ను తిరస్కరించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాల్లో అవకతవకలు ఉన్నట్లు గుర్తించిన ఆర్వో ఆయన నామినేషన్ ను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. నీలేశ్ కుంభనీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ దాఖలు చేసిన మరో నామినేషన్ కూడా చెల్లనిదిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. అయితే ఈ సూరత్ స్థానంకు వీరితో పాటుగా మరో 8 మంది అభ్యర్థిగా నామినేషన్లను దాఖలు చేశారు. కాగా, వారంతా నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన సోమవారం.. మిగతా 2లో..

## ఘనంగా 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం..

- వెంకయ్యనాయుడు, చిరంజీవిలకు పద్మవిభూషణ్ ప్రదానం
- పురస్కారాలను అందజేసిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): భారత గణతంత్ర్య దినోత్సవం వేళ దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డులను అందజేసి గౌరవించారు. ఈ ఏడాది మొత్తం 132 'పద్మ' పురస్కారాలను ప్రకటించగా.. వీటిలో 5 పద్మవిభూషణ్, 17 పద్మభూషణ్, 110 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. సోమవారం సాయంత్రం దాదాపు సగం మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. మిగతావారికి వచ్చే వారం ఇచ్చే అవకాశం ఉంది. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ (మరణానంతరం) తరపున ఆయన కుటుంబసభ్యులకు పద్మవిభూషణ్ అవార్డును అందజేశారు. సినీనటుడు మిథున్ చక్రవర్తి, మాజీ గవర్నర్ రామ్‌నాయక్, ప్రముఖ గాయని ఉషా ఉథుప్ పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో పాటు పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్ ఆరోగ్యంపై మెడికల్ బోర్డు

- దిల్లీ ఏయిమ్స్‌ను ఆదేశించిన కోర్టు

దిల్లీ (ప్రజా మంటలు): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. టైప్-2 డయాబెటీస్‌తో బాధపడుతున్న ఆయన ఆరోగ్య సేవలపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఈక్రమంలోనే తన వైద్యుడితో రోజూ వీడియో మాధ్యమంలో సంప్రదించే అవకాశాన్ని కల్పించాలని ఆయన చేసిన అభ్యర్థనను కోర్టు తాజాగా తోసిపుచ్చింది. ఆయనకు క్రమంతప్పకుండా ఇన్సులిన్ అవసరమా?, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? అని పరీక్షించేందుకు వైద్యుల కమిటీని ఏర్పాటుచేయాల్సిందిగా దిల్లీ ఎయిమ్స్‌ను మిగతా 2లో..



## కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

- బెంగాల్‌లో 2016 నాటి ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చెల్లదు
- జీతాలు వెనక్కి ఇవ్వాలని ఆదేశం
- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం
- ఉపాధ్యాయులు అధైర్యపడొద్దు : సీఎం మమత



కోల్‌కతా (ప్రజా మంటలు): పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. అంతేగాక, దీని కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ పిటిషన్లపై విచారణ నిమిత్తం కోల్‌కతా హైకోర్టులో ప్రత్యేక డివిజన్ బెంచ్ ఏర్పాటైంది. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన ఈ ధర్మాసనం.. 2016 నాటి టీచర్ల నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినందున అది చెల్లదని తీర్పు వెలువరించింది. తక్షణమే ఆ నియామకాలను రద్దు చేసి కొత్త నియామక ప్రక్రియ ప్రారంభించాలని పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌ను సూచించింది. నాటి వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరిపి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో 2016 ఉపాధ్యాయ నియామక ప్రక్రియతో ఉద్యోగాలు పొందిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నాలుగు వారాల్లోగా తాము అందుకున్న వేతనాలను తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. ఆ డబ్బు మిగతా 2లో..

## రెండ్రోజులపాటు తేలికపాటి వర్షాలు

కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

హైదరాబాద్,ఏప్రిల్22 (ప్రజా మంటలు): రాష్ట్రంలో రానున్న రెండ్రోజులపాటు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా కోస్తా తీరం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు పేర్కొంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది. మరోవైపు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. అయితే మిగతా 2లో..



## ప్రజా నాడి




## మా మేనిఫెస్టోపై బహిరంగ చర్చకు సిద్ధం

- మోదీపై ఖర్గే సవాల్ - రాజ్యాంగాన్ని మార్చేందుకే.. '400 సీట్ల' ప్రచారమని వ్యాఖ్య

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400 స్థానాలను కైవసం చేసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని మార్చడానికి అవసరమైన మూడోవంతు మెజార్టీ లక్ష్యంగానే ఆ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలోని చన్నపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ మేనిఫెస్టోపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. తమ ఎన్నికల హామీలు ముస్లింలీగ్ ఆలోచనను ప్రతిబింబిస్తున్నాయని ప్రధాని మోదీ చెప్పడంపై ఖర్గే మండిపడ్డారు. 'మూడింట రెండొంతుల మెజార్టీ కోసం మోదీ చూస్తున్నారు. రాజ్యాంగాన్ని మార్చాలంటే ఈ మెజార్టీ కావాలి. అందుకే 400 సీట్లు రావాలని మోదీ పిలుపు నిస్తున్నారు' అని ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటనలు చేస్తోన్న ఆర్ఎస్ఎస్, భాజపా నేతలను ప్రధాని ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. వారి మనసులోనే అది ఉందని, అదే జరగాలని కోరుకుంటున్నందువల్లే అటువంటి నేతలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. తమ మేనిఫెస్టోను ముస్లిం లీగ్‌తో పోల్చడంపైనా ఖర్గే విరుచుకుపడ్డారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు కనీస మద్దతు ధర వంటివి ఇవ్వడం ముస్లిం లీగ్ కిందకు వస్తాయా? అని ప్రశ్నించారు. దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమన్నారు. 1989 నుంచి గాంధీ కుటుంబీకులు ఎవరూ ప్రధానిగా, ముఖ్యమంత్రిగా కొనసాగలేదని చెప్పారు. అయినప్పటికీ గాంధీ కుటుంబంపై



మోదీ మాత్రం విమర్శలు ఆపడం లేదన్నారు. మోదీ 'హిట్ అండ్ రన్' లాంటి వారని, స్థిరంగా నిలబడి సమస్యలపై చర్చించాలని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

## అయోధ్యకు పెరిగిన భక్తుల తాకిడి

సుమారు 1.5 కోట్ల మంది భక్తుల దర్శనం

అయోధ్య,ఏప్రిల్22 (ప్రజా మంటలు): అయోధ్యకు భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. జనవరి 22న ప్రాణప్రతిష్ఠ జరిగినప్పటి నుంచి అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని సుమారు 1.5 కోట్ల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ విషయాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. రామ్ లల్లా దర్శనం కోసం ప్రతిరోజూ సుమారు లక్ష మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నారని తెలిపారు. ఇటీవల శ్రీరామనవమి వేడుకలు అయోధ్య రామమందిరంలో ఘనంగా జరిగాయి. ఆ రోజు దాదాపు 19 గంటల పాటు ఆలయాన్ని తెరచి ఉంచినట్లుగా చంపత్ రాయ్ తెలిపారు. రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ జరిగిన ఆలయంలోని గ్రౌండ్ ఎలోర్ మాత్రమే పూర్తయ్యింది.. , మొదటి అంతస్తు పనులు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. ఆలయం చుట్టూ 14 అడుగుల వెడల్పుతో ప్రాకారాన్ని నిర్మించనున్నామని, దీనిని ఆలయ పర్కోట అంటారని వివరించారు కాగా జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ చేతులు మీదుగా బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. జనవరి 23 నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించడంతో అయోధ్యకు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. రాముడి దర్శనం చేసుకోవాలను కునే భక్తులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు లాంటి ఏదో ఒక గుర్తింపు పత్రం తీసుకెళ్లాలి. హారతి కార్యక్రమానికి ఉచితంగానే పాస్ ఇస్తారు.

# దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి..

## మల్కాజిగిరి,నిజామాబాద్,ఆదిలాబాద్ జనజాతర సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి







పార్టీ నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలు అయ్యాక బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియదన్నారు. 'నిజామాబాద్ అంటే నాకు ప్రత్యేక అభిమానం. అధికారంలోకి రాగానే చక్కెర పరిశ్రమలు పునరుద్ధరణ గురించి ఆలోచించాం. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. కవిత ఎంపీగా ఉన్నప్పుడు ఇక్కడి రైతులను పట్టించుకోలేదు. పసుపు బోర్డు ఏర్పాటుపై బాండు రాసి ఇచ్చి భాజపా ఎంపీ అర్వింద్ మోసం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి తప్పక ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. చక్కెర పరిశ్రమ, పసుపు బోర్డులను జీవన్‌రెడ్డి సాధిస్తారు. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. కానీ, మోదీ దేవుడిని, భక్తిని ఓట్లుగా మార్చుకుంటున్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని కాపాడాలంటే మళ్లీ కాంగ్రెస్ గెలవాలి'అని రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ లో ఎంపీ అభ్యర్థిగా ఉన్న జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు. నిజామాబాద్ లో పెండింగ్ లో ఉన్న పనులన్నీ చేసే పూచీ తనదే అని హామీ ఇచ్చారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని కూడా త్వరలో తెరిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వీలైతే సెప్టెంబరు 17లోపు చక్కెర కర్మాగారాలను తెరిపించే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని చెప్పారు. గతంలో 2014 ఎన్నికల సమయంలో కవిత ఎంపీగా ఎన్నికకాక ముందు వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి చేయలేదని అన్నారు. అందుకే చైతన్యవంతం గల నిజామాబాద్ రైతులు కవితను, ఆమె జెండాను 100 మీటర్ల లోతులో పాతిపెట్టి.. 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా భయపడే పరిస్థితికి తెచ్చారని అన్నారు. వెనకటికి ఎవడో తాతకు దగ్గు నేర్పినట్లుగా రైతులను మభ్యపెట్టేటట్లుగా స్పైసెస్ బోర్డును పసుపు బోర్డుగా నమ్మబలుకుతున్నారని అన్నారు. నిజామాబాద్ రైతులకు అండగా వారి గళాన్ని పార్లమెంటులో వినిపించడం కోసం జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రభుత్వం ఏర్పడుతుందని.. ఆ ప్రభుత్వంలో జీవన్ రెడ్డి వ్యవసాయ మంత్రి అవుతారని రేవంత్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒప్పించి మరీ జీవన్ రెడ్డిని వ్యవసాయ మంత్రిని చేసే బాధ్యత నాదే అని అన్నారు. చక్కెర కర్మాగారాన్ని, పసుపు బోర్డును తెచ్చే సత్తా జీవన్ రెడ్డికి ఉందని అన్నారు. అంతకుముందు ఆదిలాబాద్ జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. 'త్వరలో రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తాం. కొమురం భీం ఆశయ సాధనకు కృషి చేస్తాం. ఇంద్రవెల్లి ప్రాంతంలో స్మృతి వనం నిర్మిస్తాం. కుప్తి ప్రాజెక్టును పూర్తి చేస్తాం.. కడెం ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేశాం. తుమ్మడి హట్టి వద్ద ప్రాణహిత నదిపై చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తాం. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాం. దానికి బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు పెడతాం అని వివరించారు. కాంగ్రెస్ ను పడగొట్టిన, ఓడ గొడితే పేద ప్రజలకు నష్టం. గల్లీలో ఉన్న కేసీఆర్, ఢిల్లీలో ఉన్న మోదీ మా ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారు. కేసీఆర్ ను మోదీని వంద అడుగుల లోతులో బొందపెట్టాలి, నడి రోడ్డులో ఉరి తీయాలి అన్నారు. వీళ్లిద్దరూ తోడు దొంగలు. వీళ్ళను బండ కేసి కొట్టాలన్నారు. ఆదిలాబాద్ లో ఇక్కడి విద్యార్థుల కోసం యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. ఆదిలాబాద్ లో సీసీఐ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తాం. ఆర్టీసీ బస్సులో మహిళకు ఉచిత ప్రయాణం అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ది. ఇప్పటిదాకా రూ.1300 కోట్ల రూపాయలను ఆర్టీసీకి చెల్లించాం. రాజీవ్ ఆరోగ్య శ్రీని కేసీఆర్ రిమ్మ మత్తులో నిర్లక్ష్యం చేశారు. మన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మోదీ కూలగొట్టాలని చూస్తున్నాడు.

40 లక్షల కుటుంబాలకు గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తున్నాం. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత పథకాన్ని చూసి కేసీఆర్, మోదీ కండ్లు మండుతున్నాయి. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే ఈ పథకాలు అమలు అవుతాయా ఆలోచించండి' అని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఒక్కోసారి ఓటమి కూడా గెలుపుకు పునాది వేస్తుందని చెప్పారు సీఎం. తాను 2018 ఎన్నికల్లో ఓడిపోతే మాల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచి కాంగ్రెస్ అధిష్టానాన్ని అకర్షించి... పీసీసీ చీఫ్, సీఎం అయ్యాయని గుర్తుచేశారు. జీవన్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయారని ఎంపీగా ఆయనకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆరో గ్యారంటీ రుణమాఫీ పథకం చేపట్టేలోపే.. ఎన్నికల కోడ్ వచ్చిందని.. ఎన్నికల కోడ్ ముగియగానే రుణమాఫీ పక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని సీఎం హామీ ఇచ్చారు. ఆగస్టు15 లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతుల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. రైతులు ఎంత పంట పండించిన 500 రూపాయిలు బోనస్ ఇచ్చి ప్రతి గింజ కొంటారని తెలిపారు. ప్రదాని మోదీ ఓటమి భయంతోనే మతాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. హిందువుల ఆస్తులు ముస్లింలకు పెడతామని మోడీ తప్పుడు ప్రచారం చేస్తున్నారనని చెప్పారు. మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని బిజెపి ప్రయత్నం చేస్తోంది ఆరోపించారు. దేశాన్ని మత సామరస్యానికి చిహ్నంగా ఉండేలా రాజ్యాంగం చేసిందన్నారు సీఎం.

**రాజకీయాల్లో పడిపోతున్న నాకు అండగా నిలిచింది మాల్కాజిగిరి ప్రజలే..**

రాజకీయాల్లో పడిపోతున్న తనకు కేసీఆర్‌తో పోరాడేంత బలం ఇచ్చింది.. మాల్కాజిగిరి ప్రజలు, పార్టీ కార్యకర్తలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడ ఎంపీగా చేసిన పోరాటంతోనే పీసీసీ అధ్యక్ష పదవి, ముఖ్యమంత్రి పదువులు వచ్చాయన్నారు. మాల్కాజిగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ 'జనజాతర'సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు."మల్కాజిగిరి నియోజకవర్గాన్ని నేనెప్పుడూ మర్చిపోను. కొడంగల్‌లో ఓడిపోతే ఇక్కడ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించారు. భారాస ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇక్కడ అభివృద్ధి లేనందునే కోకాపేటలో పెరిగినట్లుగా ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరగలేదు. ఇక్కడి ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ఏదైనా అడిగేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఇప్పుడు లేరు. ఈ ఎన్నికల్లో అయినా మాల్కాజిగిరి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి. భారాస అధినేత కేసీఆర్ భాజపాతో చీకటి ఒప్పందం చేసుకున్నారు. రాష్ట్రంలో 5 ఎంపీ స్థానాల్లో భాజపాను గెలిపిస్తానని మోదీతో కేసీఆర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట భాజపాకి భారాస మద్దతిస్తోంది. ఇన్నాళ్లు తనను గుండెల్లో పెట్టుకున్న హుజూరాబాద్ ప్రజలు ఇప్పుడు ఎందుకు ఓడించారో మాల్కాజిగిరి భాజపా ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ చెప్పాలి. కేసీఆర్, కేటీఆర్ అవినీతిపై విచారణ జరపాలని అమిత్‌షాను ఈటల ఎందుకు కోరలేదు? కేటీఆర్ అవినీతి, ఫోన్ల ట్యాపింగ్ గురించి ఎందుకు మాట్లాడటం లేదు? మోదీ ఇచ్చిన హామీలపై బహిరంగ చర్చకు ఈటల సిద్ధమేనా?పదేళ్లు అధికారంలో ఉన్న మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదు. ఆయన రైతు వ్యతిరేక చట్టాలు తెస్తే.. అవి రద్దయ్యే వరకు కాంగ్రెస్ పోరాటం చేసింది. సాగు చట్టాలు రద్దు చేసి.. ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పేలా చేసింది రైతులు, కాంగ్రెస్ నేతలే. ఓట్ల కోసం ఆయన మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. మతాలు, భాషల మధ్య చిచ్చుపెట్టి గెలవాలని భాజపా చూస్తోంది. దేవుడి పేరు మీద రాజకీయం చేసే వారిని పొలిమేర వరకు తరిమికొట్టాలి"అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**సీఎం హెలిప్యాడ్ వద్ద డ్రోన్ కలకలం**

సీఎం రేవంత్‌రెడ్డి హెలిప్యాడ్ వద్ద డ్రోన్ కలకలం రేపింది. శామీర్‌పేట వద్ద ఉన్న హెలిప్యాడ్ వద్ద ఓ వ్యక్తి డ్రోన్‌ను ఎగరవేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని



# కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

వసూలు బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని సూచించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత పార్థా ఛటర్జీ ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

**హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం: మమత**

పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ద్వారా నియమితులైన 26 వేల మంది ఉద్యోగాలను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు.ఉద్యోగాలను రద్దు చేయడంతో పాటు.. వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలన్న కోర్టు ఆదేశాలను సవాలు చేస్తామని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర బెంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మమత పాల్గొన్నారు. ఈసందర్భంగా కోర్టు తీర్పుపై మీడియాతో మాట్లాడారు. "ఉపాధ్యాయ నియామక ప్రక్రియను పూర్తిగా రద్దు చేయడం చట్ట విరుద్ధం. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా నిలబడతాం. వారికి న్యాయం జరిగేవరకు పోరాడతాం. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తాం. ఉద్యోగాలు కోల్పోయిన వారు అధైర్యపడొద్దు" అని మమత అన్నారు. పైగా 8 ఏళ్ల వేతనాన్ని కేవలం 4 వారాల గడువులో చెల్లించడం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. కొందరు భాజపా నేతలు న్యాయవ్యవస్థను, న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్నారంటూ ఆరోపించారు.భాజపా నేత సువేందు అధికారి పార్టీ కార్యకర్తలతో ఇటీవల మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "సోమవారం వరకు వేచి చూడండి.. కీలక పరిణామం చోటుచేసుకుంటుంది. దాంతో ఆ పార్టీ ఇక కోలుకోలేదు" అని అన్నారు. ఈ వ్యాఖ్యలను ఉటంకిస్తూ మమత.. కోర్టు తీర్పు రాకముందే వారికెలా తెలిసిందంటూ మమత ప్రశ్నించారు. తాను చేసిన వ్యాఖ్యలపై సువేందు అధికారి వివరణ ఇచ్చారు. ఆ పార్టీలో తిరుగుబాట్లు, అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అలా అన్నానని వివరణ ఇచ్చారు. మరోవైపు కోర్టు ఇచ్చిన తీర్పును ఆ పార్టీ స్వాగతించింది. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగిందని పేర్కొంది.ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ (ాఒూ) నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టంచేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. అంతేగాక, దీని కింద ఉద్యోగాలు దక్కించుకున్న టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది.


# బీజేపీ ఖాతాలో తొలి విజయం

**- గుజరాత్‌లోని సూరత్ స్థానాన్ని చేజిక్కించుకున్న కమలం**

**- పార్టీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవ ఎన్నిక**

వారు దాఖలు చేసిన నామినేషన్లను ఉపసంహరించుకొని పోటీ నుంచి వైదొలగతున్నట్లు ప్రకటించారు. అయితే నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో బీఎస్పీ అభ్యర్థి కూడా ఉండడం గమనార్హం. కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురి అవ్వడం, మిగిలిన వారు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో బీజేపీ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ముకేశ్ దలాల్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవం కావడంతో ప్రస్తుతం ఈ స్థానంలో పోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదు. దీంతో ప్రధాని మోదీకి సూరత్ తొలి విజయాన్ని అందించింది అంటూ.. గుజరాత్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కాగా, గుజరాత్ లోని మొత్తం 26 లోక్ సభ స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి.

## రెండ్రోజులపాటు తేలికపాటి వర్షాలు



వచ్చే రెండ్రోజులు సాధారణం కంటే కాస్త ఎక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఉక్కపోత పెరగొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగ్రతల పెరుగుదలకుతోడు రెండు రోజులపాటు వడగాడ్పులు కూడా వీయొచ్చని పేర్కొంది. హాలియా, భానుపురి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అనుముల మండలంతోపాటు హాలియా, సూర్యాపేట పట్టణం, ఆత్మకూర్ (ఎస్) మండలంలో గాలిదుమారంతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులకు హాలియాలో ఎడమ కాల్వ సమీపంలోని శివాలయ ధ్వజస్తంభం విరిగిపోయింది. సూర్యాపేటలోని అంజనాపురి కాలనీ, విద్యానగర్‌తోపాటు పలు వార్డుల్లో చెట్లు విరిగిపడ్డాయి.

# రేపే ఇంటర్ ఫలితాలు..

**- బోర్డు అధికారిక ప్రకటన**

హైదరాబాద్ (ప్రజా మంటలు):

తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలకు సంబంధించి ఇంటర్ బోర్డు కీలక అప్‌డేట్ ఇచ్చింది. రేపు ఉదయం 11 గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాలు ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.ఈ ఫలితాలను ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా విడుదల చేస్తారని పేర్కొంది. ఈ ఫలితాలను https://tsbie.cgg.gov.in, http://results.cgg.gov.in చెక్ చేసుకోవచ్చు.ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలను 9,80,978 మంది విద్యార్థులు రాశారు. మార్చి 10 నుంచి మూల్యాంకనం ప్రారంభించిన అధికారులు.. ఏప్రిల్ 10తో పూర్తి చేసిన అధికారులు ఫలితాల విడుదలకు రంగం సిద్ధం చేశారు. మరోవైపు, పదోతరగతి ఫలితాలను ఈనెల 30 లేదా మే 1వ తేదీన విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# ముయిజ్జు అనుకూలుడికే పట్టం..

**– మాల్దీవుల పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ భారీ విజయం**

మాలే (ప్రజా మంటలు):



మాల్దీవుల పార్లమెంటరీ ఎన్నికల్లో అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధించింది. మొత్తం 93 స్థానాలకు గాను 70 సీట్లను కైవసం చేసుకుంది. ముయిజ్జుకు అగ్నిపరీక్షగా నిలిచిన ఈ ఎన్నికలను అటు చైనా, ఇటు భారత్‌లు నిశితంగా పరిశీలించాయి.మాల్దీవుల పార్లమెంటు (పీపుల్స్ మజ్లీస్)లోని 93 నియోజకవర్గాలకు ఆదివారం పోలింగ్ నిర్వహించారు. మొత్తం 602 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటుచేశారు. వీటితోపాటు మూడు విదేశాల్లో (భారత్‌లోని తిరువనంతపురం, శ్రీలంకలోని కొలంబో, మలేషియాలోని కౌలాలంపూర్) వీటిని ఉంచారు. మొత్తం 2.84 లక్షల ఓటర్లు ఉండగా.. 75 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాల్లో ముయిజ్జుకు చెందిన పీఎన్‌సీ 70 స్థానాలను గెలుచుకోగా.. దాని మిత్రపక్షాలు మూడుచోట్ల విజయం సాధించాయి. భారత్‌కు అనుకూలంగా ఉండే మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలికి చెందిన మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ (ఓఆఖ) 15 సీట్లకే పరిమితమైంది. ఈ పార్టీ గతంలో 65 స్థానాలను గెలుచుకోవడం గమనార్హం.మాల్దీవుల్లో చిన్న ద్వీపాలు కలిపి దాదాపు 1,192 ప్రాంతాలున్నాయి. ఇవన్నీ 800 కి.మీ. పరిధిలో విస్తరించి ఉన్నాయి. శ్వేతవర్ణపు బీచ్‌లు, రిసార్టులతో మెరిసిపోయే ఈ ప్రాంతం.. హిందూ మహాసముద్రంలో భౌగోళిక రాజకీయాలకు వేదికగా మారింది. అయితే, తమ దేశంపై భారత్ ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్న ముయిజ్జు.. చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేశారు. మూడు నెలల క్రితం చైనాలో పర్యటించి.. అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి రక్షణ సహకారం, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల ఒప్పందాలపై సంతకాలు చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి డ్రాగన్ కంపెనీలకే ముఖ్యమైన కాంట్రాక్టులు కట్టబెట్టారు.'చిన్న దేశమైనంత మాత్రాన.. మమ్మల్ని వేధించేందుకు లైసెన్సు ఇవ్వలేదంటూ' భారత్‌ను ఉద్దేశిస్తూ ముయిజ్జు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో భారత్‌కు చెందిన సైన్యం తిరిగి వెళ్లిపోవాలని డెడ్‌లైన్ విధించారు. ఈక్రమంలో భారత బలగాలు వెనక్కి వచ్చేశాయి. అధ్యక్షుడి ఈ చర్యలపై సొంత దేశంలోనే విమర్శలు వచ్చాయి. చివరకు మాటమార్చిన ఆయన భారత్ ఆర్థికసాయం తమకెంతో ముఖ్యమని చెప్పారు.భారత్ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ముయిజ్జును విపక్ష 'ఎండీపీ' కట్టడి చేసేందుకు యత్నించింది. ముఖ్యంగా భారత సైన్యాన్ని వెనక్కి పంపించివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. 2018 నుంచి అవినీతి జరిగిందని ఆరోపిస్తూ వచ్చిన ఓ నివేదికపై దర్యాప్తు జరపడంతోపాటు అధ్యక్షుడిపై అభిశంసన చేపట్టాలని డిమాండ్ చేసింది. అయినప్పటికీ భారత్ వ్యతిరేక నినాదంతో ఎన్నికల్లోకి వెళ్లిన మహమ్మద్‌కే అక్కడి ప్రజలు పట్టం కట్టారు.మొన్నటివరకు సంకీర్ణ ప్రభుత్వంలో ఉండటంతో మహమ్మద్ ముయిజ్జు ఆటలు సాగలేదు. అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ పార్టీ బలం తక్కువగా ఉండటంతో అక్కడి పార్లమెంటులో సొంత నిర్ణయాలు తీసుకోలేకపోయారు. తాజా పార్లమెంటరీ ఎన్నికల్లో మాత్రం భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. దీంతో ఆయనకు నచ్చిన విధానాలను రూపొందించుకునేందుకు మార్గం సుగమమైనట్లు విశ్లేషకుల అంచనా. ఈ క్రమంలో భారత్‌తోనూ ముయిజ్జు దౌత్యపరంగా ఎటువంటి వ్యూహాలు అనుసరిస్తారనే విషయాన్ని చూడాలి.

## తెలంగాణలో అధికారం భాజాపాదే - పీయూష్ గోయల్

చేవెళ్ల (ప్రజా మంటలు):

తెలంగాణలో హైదరాబాద్ సహా మెజార్టీ స్థానాల్లో భాజపా గెలువబోతుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.దేశంలో ఎన్డీయే కూటమి 400కు పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల్లో ఐకమత్యం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కేరళలో సీపీఐతో కుస్తీ.. దిల్లీలో దోస్తీ చేస్తోందని ఎద్దేవా చేశారు. 2047 నాటికి వికసిత్ భారతే తమ లక్ష్యమన్నారు. మోదీ హవాతో ఈ ఎన్నికల్లో తెలంగాణలో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి భాజపా అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. రాజేంద్రనగర్‌లోని ఆర్వో కార్యాలయంలో ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంపదను కాంగ్రెస్ లాక్కుంటుంది

**– రాహుల్ 'సంపద పునఃపంపిణీ' ప్రకటనపై మోదీ వ్యాఖ్యలు**

లఖ్‌నవూ (ప్రజా మంటలు):



ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు ఇళ్లు ఉన్న వారి నుంచి ఒక ఇంటిని లాక్కుంటుందని ప్రధాని మోదీ అన్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన 'సంపద పునఃపంపిణీ' ప్రకటనను ఉద్దేశిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో నిర్వహించిన పార్టీ బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొని ప్రసంగించారు."కాంగ్రెస్ యువరాజు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీకు ఎంత ఆస్తి ఉంది, ఎన్ని ఇళ్లు ఉన్నాయి అని విచారణ జరుపుతామన్నారు. మీకు పూర్వీకుల ఇల్లు ఉండి, మరో ఫ్లాట్ కూడా ఉంటే వాటిలో ఒకటి లాగేసుకుంటారు. ఇది మావోయిస్టు, కమ్యూనిస్టు భావజాలం. వాటినే కాంగ్రెస్ భారతదేశంలో అమలుచేయాలనుకుంటుంది. నేను దేశ ప్రజలను హెచ్చరిస్తున్నాను. ఇండియా కూటమి దృష్టి మీ సంపాదన, ఆస్తులపై పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎవరెవరు ఎంత సంపాదిస్తున్నారు, ఎవరికి ఎన్ని ఆస్తులు ఉన్నాయో, అమ్మానాన్నలకు, అక్కచెల్లెళ్లకు ఎంత బంగారం ఉందో విచారణ చేస్తామని కాంగ్రెస్ అంటోంది." అని ప్రధాని మండిపడ్డారు. ఈ రాజవంశీయులు దేశ ప్రజలను దోచుకొని తమ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకున్నారని పరోక్షంగా సోనియాగాంధీ కుటుంబాన్ని ఉద్దేశిస్తూ అన్నారు. ప్రజలను దోచుకోవడం వారి జన్మహక్కు అనుకుంటున్నారని మోదీ విమర్శించారు.

# త్వరలో 'పది' ఫలితాలు

**- పదిరోజుల్లో వెలువడే అవకాశం - ఈసీ అనుమతితో అధికారుల కసరత్తు**

హైదరాబాద్ (ప్రజా మంటలు): తెలంగాణలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు మరో 10 రోజుల్లో వెలువడే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం నుంచి అనుమతి రావడంతో ఫలితాల వెల్లడికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టెన్త్ జవాబుపత్రాల మూల్యాంకన పక్రియ ఏప్రిల్ 20తో ముగిసింది. ఫలితాలను డీకోడింగ్ చేయడానికి మరో వారంరోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో 10 రోజుల్లో ఈ పక్రియ అంతా పూర్తిచేసి ఏప్రిల్ 30న ఫలితాలను వెల్లడించాలని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ ఏప్రిల్ 30న కుదరని పక్షంలో మే 1న పదోతరగతి ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ దృష్ట్యా మంత్రులుకాకుండా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం వీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 2,57,952 మంది బాలురు కాగా.. 2,50,433 మంది బాలికలు ఉన్నారు. ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి జవాబపత్రాల స్పాట్ వాల్యూయేషన్ పక్రియ మొదలైంది.

# మోడీ ఛరిష్మాను నమ్ముకున్న బిజెపి

**12 సీట్లు గెలుస్తామన్న ధీమాలు రాష్ట్ర నేతలు**

**దక్షిణాదిలో తెలంగాణపై దృష్టి పెట్టిన అగ్రనాయకత్వం**

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రజా మంటలు):** తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో పది నుంచి 12 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ముందుకు సాగుతోంది. మోడీ ఛరిష్మాతో 12 సీట్లు సాధిస్తామని రాష్ట్ర బిజెపి నేతలు బలంగా నమ్ముతున్నారు. అన్నింటికీ నమో అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అగ్ర నేతలు తెలంగాణలో ప్రచారానికి ప్రధాన్యత ఇవ్వబోతున్నారు. ఈ మేరకు ఆయా స్థానాలు గెలిచేందుకు ఉన్న అవకాశాలు, అక్కడ అనుసరించాల్సిన వ్యూహాలపైనా రాష్ట్ర నాయకులకు పార్టీ అగ్రనాయకత్వం దిశా, నిర్దేశం చేసింది. క్షేత్రస్థాయిలో తమకు సానుకూలంగా ఉన్న అంశాలను మరింత బలోపేతం చేసుకోవడంతోపాటు ముఖ్య నేతల ప్రచారం కూడా తోడైతే విజయం సాధించడం సులభమవు తుందన్న భావనను ఆ పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే ఆ పార్టీ అగ్ర నేతలు రాష్ట్ర పర్యటనకు క్యూ కడుతున్నారు. పార్టీ ప్రచారానికే కాకుండా ముఖ్య నేతలు నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కూడా కొందరు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే దక్షిణాదిలో ప్రధానంగా తెలంగాణలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ అగ్రనాయకత్వం దృష్టి సారించింది. ఇప్పటికే తెలంగాణలోని కీలక నేతలు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల చివరి వారంలో కేంద్ర అగ్ర నాయకులు కూడా తెలంగాణలో ప్రచారానికి రానున్నారు. ముఖ్య నాయకుల ప్రచారంతో జోరు పెంచేందుకు



బీజేపీ సిద్ధమవుతోంది. ఈ నెల 25న నామినేషన్ల దాఖలు గడవు ముగియనున్ననేపథ్యంలో పలువురు జాతీయ నేతలు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ప్రచారానికి వస్తున్నారు. ఈ నెల 25న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా వరంగల్‌తోపాటు మరో మూడు చోట్ల ఆయన ప్రచారం చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం కానున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల పరిధిలో పార్టీ పరంగా నిర్వహిస్తున్న ప్రచారం, ప్రజలకు చేరవయ్యేందుకు అమలు చేస్తున్న కార్యాచరణ, పోలింగ్ బూత్ స్థాయిల్లో జరుగుతున్న కృషి, ఎన్నికలకు సంబంధించిన ఇతర అంశాలను ఆయన రాష్ట్ర ముఖ్య నేతలతో ఆయన సమీక్షించనున్నారు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. అమిత్ షాతోపాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ కూడా ఆది, పార్టీ ఎన్నిలకు సిద్ధమవుతున్న తీరు, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రచారంపై ఆయన సమీక్షించనున్నట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలోని పలు పార్లమెంట్ స్థానాల పరిధిలో ప్రచారాన్ని నిర్వహించేందుకు ప్రధాని మోదీ కూడా రానున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. ఈ నెలాఖరులో గానీ, మే మొదటి వారంలోగానీ పర్యటనకు రానున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధాని మోదీ ఇప్పటికే ఒకసారి ప్రచారానికి వచ్చారు. మలి విడత ప్రచారానికి రానున్న ప్రధాని మోదీ మూడు నాలుగు సభలతోపాటు రోడ్ షోల్లో పాల్గొంటారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రధాని పాల్గొననున్న సభలు, రోడ్ షోలకు సంబంధించిన వివరాలను పార్టీ నాయకత్వం ఖరారు చేయాల్సి ఉంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ నెలాఖరు లేదా మే పదో తేదీలోగా రాష్ట్రానికి వస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఓరుగల్లు కోటపై పార్టీల దృష్టి

**గెలుపు లక్ష్యంగా దూసుకుపోతున్న నేతలు**

**కడియం, ఆరూరిల ఓటమి ధ్యేయంగా బిఆర్ఎస్ ప్లాన్**

**నేడు పార్టీ కార్యకర్తలతో భేటీ కానున్న కెటిఆర్**



**వరంగల్, ఏప్రిల్ 22 (ప్రజా మంటలు):** వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీలె గెలుపు కోసం కసరత్తు చేస్తున్నాయి. వరంగల్ లోక్ సభ స్థానం ఎస్సీ రిజర్వ్ కాగా, ఇక్కడ ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి కడియం కావ్య, బీజేపీ నుంచి ఆరూరి రమేశ్, బీఆర్ఎస్ నుంచి మారపెల్లి సుధీర్ కుమార్ పోటీలో నిలిచారు. కాగా, పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. కడియం కావ్య మార్నింగ్ వాక్ లు నిర్వహిస్తూ ప్రచారాలు చేస్తున్నారు. పార్లమెంట్ నియోజక వర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా సోషల్ మీడియా వింగ్‌తో పాటు పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ కూడా ప్రచార దూకుడు పెంచారు. ప్రత్యేకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రచార రథాలు రెడీ చేయించి తిప్పుతున్నారు. బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ మాత్రం పార్టీ మీటింగులకే పరిమితం కాగా, నామినేషన్ వేసిన తర్వాత నుంచి ప్రచార కార్యక్రమాలు హోరెత్తించనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రధానంగా తమ పార్టీని వీడిన ఆరూరి రమేశ్, కడియం కావ్యలను ఓడించడమే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి. ఇప్పటికే నామినేషన్ల పక్రియ ప్రారంభం కాగా, అభ్యర్థులు ఓ వైపు జనాల్లోకి ఉరుకులు, పరుగులు పెట్టడంతో పాటు చేరికలు, నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో వరంగల్ లో ప్రచార వేడి మొదలవగా.. ఎంపీ టికెట్ గెలవడమే లక్ష్యంగా ప్రధాన పార్టీల అగ్రనాయకులు ఓరుగల్లు బాట పడుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ లో రోడ్డు షోలు, ప్రచార సభలు నిర్వహించనుండగా, ఏప్రిల్ నెలాఖరులో బీజేపీ అగ్రనేతలు పర్యటించనున్నారు. ఇలా ప్రధాన పార్టీల అగ్రనేతలు ఓరుగల్లు బాట పడుతుండటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. కడియం పార్టీ మార్పు తర్వాత కాంగ్రెస్, బీఆర్?ఎస్ మధ్య తీవ్ర వైరం ఏర్పడగా, ఎలాగైనా కడియంను ఓడగొట్టాలని గులాబీ పార్టీ కసిగా ఉంది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్?ను వరంగల్ కు తీసుకొచ్చి ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దుకోవాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 23న మాజీ మంత్రి కేటీఆర్ వర్ధన్నపేట కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని, కార్యకర్తలకు దిశా నిర్దేశర చేయనున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 28న వరంగల్ లో రోడ్డు షో నిర్వహించనున్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం 24న మడికొండలో నిర్వహించే ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు చెందిన వారే ఉండటం, ప్రజల్లో కూడా సానుకూల స్పందన ఉందనే ఉద్దేశంతో ఇక్కడి నేతలున్నారు. ఈ తరుణంలో సీఎం సభ మరింత కలిసి వస్తుందనే భావనలో ఉన్నారు. వరంగల్ ఎంపీ సీటుపై ఆశలు పెట్టుకున్న బీజేపీ ఇక్కడికి పార్టీ అగ్రనేతలను తీసుకొచ్చే ఎ÷–లాన్ చేస్తోంది. ఈ నెల 24న బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ నామినేషన్ వేయనుండగా, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వస్తారని అందరూ భావించగా, ఆయన పర్యటన రద్దయినట్లు తెలిసింది. దీంతో 25న కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఇక్కడికి తీసుకొచ్చేందుకు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఈ నెల 27న ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ కు రానుండగా, ఆయనను వరంగల్ కు తీసుకురావాలని ఇక్కడి నాయకులు భావిస్తున్నారు.

# గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయండి - హరీశ్



**సంగారెడ్డి (ప్రజా మంటలు):** సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్ విసిరారు. ఆగస్టు 15 లోపు రూ. 39 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు రైతుబంధు పూర్తిగా ఇవ్వలేదు కానీ ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తా అంటున్నాడని ఎద్దేవా చేశారు. మీరిచ్చిన ఆరు గ్యారెంటిలే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మీకు భస్మాసురహస్తం అవుతాయని హరీష్ రావు హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో హరీష్ రావు సమావేశం నిర్వహించారు. రైతురుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్, ఆసరా పెన్షన్ పెంపు, మహిళలకు 2,500 రూపాయల సహాయం, కళ్యాణాలక్ష్మి కి తులం బంగారం, నిరుద్యోగ భృతిపై మాట తప్పినందుకు కాంగ్రెస్ ని ఓడించాలన్నారు హరీష్ రావు. రేవంత్ రెడ్డి అంటే మాటల కోతలు..కాంగ్రెస్ అంటే కరెంట్ కోతలని విమర్శించారు. నాలుగున్నర నెలల్లోనే సీఎం ఏదేదో చేసినట్టు ఓటేయకపోతే పథకాలు బంద్ అవుతాయని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని హరీష్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల ఆత్మహత్యలు మొదలయ్యాయన్నారు. కాంగ్రెస్ అంటే కరువు, కరెంట్ కోతలు, మంచినీళ్ల కష్టాలు, అవినీతి అని విమర్శించారు హరీష్ రావు. 2014, 2019 రెండు సార్లు దేశంలో కాంగ్రెస్ కి ప్రతిపక్ష హోదా దక్కలేదని... మీ పాలన వద్దని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. మెడలో పేగులేసుకుంటా,మానవ బాంబునై పేలుతా, డ్రాయర్ ఊడగొడుతా అంటూ సీఎం పదవికి అర్థం లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని చెప్పారు హరీష్.

# మెదక్ గెలుపు లక్ష్యంగా హరీష్ ప్రచారం

**పాగా వేయాలని కాంగ్రెస్ ఎత్తులు**

**ప్రచారంలో దూసుకుపోతున్న రఘునందన్**



**మెదక్, ఏప్రిల్ 22 (ప్రజా మంటలు):** మెదక్ లోక్‌సభతో పాటు, జహీరాబాద్ లోక్‌సభ గెలుపుపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయన ఈ రెండు సీట్లను గెలిపంచుకునే లక్ష్యంతో పగలనక, రాత్రనక కష్టపడుతున్నారు. ఈ రెండు స్థానాలు ప్రతిష్టాత్మకంగా మారడంతో ప్రచార హోరు పెంచారు. సిద్దిపేట జిల్లా నుంచే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో పోలింగ్ రోజు తమ అభ్యర్థికే ఓట్లు పడే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే మూడు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఇన్ చార్జిలను నియమించడమే కాకుండా మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తు న్నారు. యూత్, స్టూడెంట్, సోషల్ మీడియా విభాగాలకు దిశానిర్దేశంచేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో 18.12 లక్షల ఓటర్లుండగా వీరిలో అత్యధికంగా బీసీ వర్గాలే ఉన్నాయి. నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లలో బీసీ వర్గాలకు చెందిన ఓటర్లు దాదాపు ఆరు లక్షల పై చిలుకు ఉండడంతో అభ్యర్థులందరూ వారిపై ఫోకస్ పెడుతున్నారు. ఇందులో ముదిరాజ్ వర్గానికి అత్యధిక ఓట్లుండడంతో వారి మద్దతు పొందేందుకు అన్ని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా ముదిరాజ్ వర్గానికి చెందిన నీలం మధు బరిలో నిలవడంతో ఆ పార్టీ నేతలు దీన్నే ప్రచార అస్త్రంగా మలుచుకుని ప్రజల్లోకి వెళ్తున్నారు.అలాగే కాంగ్రెస్ కూడా మెదక్ ఎంపి స్థానంపై ప్రత్యే దృష్టి పెట్టింది. బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ కూడా దృష్టి పెట్టింది. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ సెగ్మెంట్లను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఈ మూడు సెగ్మెంట్లలో అధికంగా ఓట్లను పొందిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో సైతం విజయానికి బాటలు వేయాలని ప్రయత్నిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ సైతం ఈ ఎన్నికల్లో ఎక్కువగా ఓట్లు సాధించడానికి పావులు కదుపుతోంది. ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు ముఖ్య నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు.బీసీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన విషయాన్ని బీఆర్ఎస్ నేతలు ప్రచారాల్లో ప్రస్తావిస్తూ ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఓబీసీ బిడ్డను మూడోసారి దేశానికి ప్రధాని చేయాలని బీజేపీ అభ్యర్థిస్తోంది. సిద్దిపేట నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే, మైనంపల్లి హన్మంతరావుకు బాధ్యతలు అప్పగించారు. నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ సాధిస్తే నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం దక్కుతుందని హామీ ఇస్తున్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నీ తానై ప్రచార వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలను కలుపుకుని రోడ్డు షోలు, మార్నింగ్ వాక్ లు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలతో ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

# కవిత బెయిల్‌పై విచారణ వాయిదా..



**హైదరాబాద్,ఏప్రిల్ 22 (ప్రజా మంటలు):** లిక్కర్ పాలసీ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు మరో బిగ్ షాక్ తగిలింది. లిక్కర్ పాలసీ ఈడీ కేసులో కవిత బెయిల్ పిటిషన్ పై విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది. ఇరువురి వాదలను విన్న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును రేపటికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. కాగా, సీబీఐ కేసులో కూడా కవితకు తీవ్ర నిరాశ ఎదురైంది. లిక్కర్ పాలసీ కేసులో భాగంగా ఈడీ అరెస్ట్ లో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ కవిత ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా కవిత తరపున న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో తన వాదనలు వినిపించారు. విచారణకు సహకరిస్తున్న కవితను అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేదని కోర్టులో కవిత తరఫు న్యాయవాది వెల్లడించారు. 'అరుణ్ రామచంద్రన్ పిళ్ళై 10 స్టేట్మెంట్స్ ఇచ్చారు. అరుణ్ రామచంద్రన్ పిళ్ళై ను ఈడీ అరెస్ట్ చెయ్యలేదు. కవితకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. అనుమనితురాలిగా కూడా లేని కవితను నిందితురాలిగా మార్చారు. 5,6 గంటలు విచారణకు హాజరైన ఒక టెర్రరిస్టు, కరుడుగట్టిన నేరస్థులను ట్రీట్ చేసినట్లు చేశారు. మార్చి 15న చట్టవిరుద్ధంగా కవితను అరెస్ట్ చేశారు. కవిత– కేజ్రీవాల్ లను కలిపి విచారించడంలో ఈడీ విఫలం అయింది. విజయ్ నాయర్ సోషల్ మీడియా హ్యాండ్లర్, ఆయనతో సోషల్ మీడియా అంశం పైనే కవిత భేటి అయ్యింది. బుచ్చిబాబు నాలుగు స్టేట్మెంట్స్ ఇచ్చాడు. ఈడీ అను కూలంగా స్టేట్మెంట్ ఇచ్చాక ఆయనకు బెయిల్ వచ్చింది. రాఘవ రెడ్డి బీజేపీ నుంచి పొత్తులో ఉన్న పార్టీ నుంచి పోటీలో ఉన్నాడు. బీజేపీకి ఎలాక్టోరల్ బాండ్లను శరత్ రెడ్డి కొనుగోలు చేసి అందించారు. వీళ్ళు ఇచ్చిన స్టేట్మెంట్స్ ఆధారంగా కవితను అరెస్ట్ చేశారు. కవిత ఆధారాలు ధ్వంసం చేశారు అంటున్నారు.. కానీ, ఆవిడ వాడిన ఫోన్లన్నీ ఈడీకి ఇచ్చారు' అని కవిత తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో తన వాదనలు వినిపించారు. అయితే ఈడీ తరఫున న్యాయవాది జోయబ్ హొస్సేన్ కోర్టులో కవితకు వ్యతిరేకంగా వాదనలు వినిపించారు. లిక్కర్ కేసులో భాగంగా ఈడీ కవితను ఫోన్లు అడిగిన తర్వాత ఆమె ఫోన్లను ఫార్మాట్ చేశారంటూ కోర్టు ముందు వెల్లడించారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న రౌస్ అవెన్యూ కోర్టు.. విచారణను రేపటికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ పిటిషన్ పై మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా.. సీబీఐ కేసులో కూడా కవితకు మరో షాక్ తగిలింది. లిక్కర్ కేసులో భాగంగా సీబీఐ అరెస్ట్ లో బెయిల్ కోరుతూ ఎమ్మెల్సీ కవిత కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ లో భాగంగా ఇరువురి న్యాయవాదుల వాదనలు విన్న జడ్జి కావేరి బవేజ తీర్పును మే 2వ తేదీకి వాయిదా వేశారు. కవిత తరఫున ఢిల్లీ కోర్టులో వాదనలు వినిపించిన న్యాయవాది.. 'మహిళగా కవిత పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్‌కు అర్హురాలు. అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి మెటీరియల్ లేదు. ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్ట్ చేశారు. ఈడి కస్టడీలో ఉండగా, సీబీఐ ఎందుకు అరెస్ట్ చేసింది?.. అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేనప్పటికీ అరెస్టు చేశారు. కవిత బీఆర్ఎస్ పార్టీకి స్టార్ క్యాంపైనర్. చిదంబరం కేసులో తీర్పు కవిత విషయంలో సరిపోతుంది. ఏడేళ్ల లోపల శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదు. అరెస్టుకు సరైన కారణాలు లేవు' అంటూ వాదించారు.సీబీఐ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది కవితకు ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ ఇవ్వొద్దంటూ కోర్టును కోరారు. 'కవితకు బెయిల్ ఇవ్వొద్దు. కవిత దర్యాప్తును ప్రభావితం చేయగలుగుతారు. కవిత లిక్కర్ కేసులో కీలక వ్యక్తిగా ఉన్నారు' అంటూ కోర్టులో వెల్లడించారు. దీంతో ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును మే 2వ తేదీకి రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది.

# కొనసాగుతున్న మానవుని జీవితములో శ్రీ రాముడు అంశముపై ప్రవచనం

**జగిత్యాల ఏప్రిల్ 22 (ప్రజా మంటలు):** స్థానిక అభయాంజనేయ ఆలయములో నంబి వేణుగోపాలాచార్య చే మానవుని జీవితంలో శ్రీరాముడు అంశంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

భక్తుల అనుగ్రహ భాషణం చేస్తూనంబి వేణుగోపాల ఆచార్య ప్రవచనములో దశరథుడు పుత్ర కామేస్టి వ్రతం రామ లక్ష్మణ భరత శత్రజ్ఞుల జననం యాగ సంరక్షణ కోసం రామలక్ష్మణులను పంపమని విశ్వామిత్రుడు దశరథుని అడుగుట యాగ సంరక్షణలో భాగంగా తాటక వద సుబాహు వధ తదితర అంశాలు ప్రవచించారు. స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మూడు రోజులపాటు మానవుని జీవితములో శ్రీ రాముడు అన్న అంశముపై ప్రవచన కార్యక్రమం సాయంత్రం సైతం కొనసాగింది. సోమవారం రెండవ రోజు కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.





# సారంగాపూర్ మండలంలో కార్నర్ మీటింగ్లో పాల్గొన్న బాజిరెడ్డి గోవర్ధన్

**సారంగాపూర్ ఏప్రిల్ 22 (ప్రజా మంటలు)** పార్లమెంటు ఎన్నికలలో భాగంగా సారంగా పూర్ మండల పెంబట్ల కోనాపుర్ గ్రామాల్లో కార్నర్ మీటింగ్ లో పాల్గొని ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించిన బి అర్ ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజీ రెడ్డి గోవర్దన్ ,ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ,ఎమ్మెల్సీ ఎల్ రమణ ,జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్ .ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వర్యులు రాజేశం గౌడ్ ,,మాజీ మార్క్ ఫెడ్ ఛైర్మెన్ లోక బాపు రెడ్డి,మాజీ లైబ్రరీ ఛైర్మెన్ చంద్ర శేకర్ గౌడ్ ,మండల పార్టీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ,మండల,గ్రామ నాయకులు, రైతులు, మహిళలు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.







# సర్వేలపై ఎన్నికల సంఘం స్పందించాల్సిందే !

పార్లమెంటుతో పాటు..కొన్న రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నేతలు దూసుకుపోతున్నారు. ఎండల వేడిమి తరుముతున్నా..నేతలు ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ఈ నెలరోజులు కష్టపడితేనే అధికారం దక్కుతుందని వారికి తెలుసు. అందుకే అలవికాని హామీలు గుప్పిస్తున్నారు. నగదు బదిలీలపై ఇష్టం వచ్చినట్లు హామీలు ఇస్తున్నారు. అధికారమే లక్ష్యంగా ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు. దీనికితోడు ఎన్నికల వేళ.. పార్టీలు, అభ్యర్థులకు అనుకూలంగా సర్వేలు వెలువరిస్తున్నాయి. పార్టీలకు అనుకూలంగా సర్వేలు వస్తున్నాయి. ఫలానా పార్టీ విజయం సాధిస్తుందనో లేక..ఫలానా వ్యక్తి గెలుస్తాడనో సర్వేలు పుంఖానుపుంఖాలుగా వార్తలను వెదజల్లుతున్నాయి. యూట్యూబర్లు ఎవరికి వారు తమకు అనుకూలంగా ఉన్న రీతిలో ప్రచారం సాగిస్తున్నారు. ప్రధానంగా కేంద్రంలోమోడీ నేతృత్వంలోని ఎన్‌డి 400సీట్లు దక్కించుకుంటుందని కొందరు..కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని కొన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయి. సర్వేలన్నీ ఆయా పార్టీలు తమకు అనుకూలంగా చేయించుకుంటున్నవే తప్ప మరోటి కాదు. ఒక్కో ఎంపీ నియోజకవర్గంలో కనీసం 15 లక్షల ఓటర్లు ఉంటే..కేవలం ఓ 5 వేల మందిని కూడా ప్రశ్నించకుండానే సర్వే నివేదికలు తయారు చేస్తున్నారు. కనసీం 5వేల మందినైనా సర్వే చేస్తున్నా రా అంటే అదికూడా అనుమానమే. దీనిని పార్టీల గ్రూపుల్లో విపరీతంగా ప్రచారం చేయిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు విస్తరించిన వేళ..ప్రచారాలకు ప్రాధాన్యం పెరిగింది. మీడియా చానెల్స్, కేంద్ర ఇంటెలిజెన్స్ పేరుతో ఫేక్ సర్వేలూ వ్యాప్తి చేస్తున్నారు. ఇలాంటి వాటిని కట్టడి చేయడంలో కేంద్ర ఎన్నికల సంఘం విఫలం అయ్యింది. సర్వేలపైనా కట్టడి చేయవలిసిందే. వాటిపై ఆంక్షలు ఉండాల్సిందే. లేకుంటే ప్రజల్లో ఓ రకమైన ఫోబియా సృష్టించే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే ప్రజలు ఎవరికి ఓటేస్తారో తెలియదు. ఎవరికి ఓటేయాలో ఆలోచించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా..వారి అభిప్రాయాలను కూడా వీరే వెల్లడిస్తు న్నారు. ఎందుకంటే లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో దేశంలో, రాష్ట్రంలో నిత్యం సర్వే రిపోర్టుల పేరుతో ప్రజల్లో ఓ రకమైన భావజాలం నింపే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ సర్వేలు ఎపుడు చేశారో, ఏ ప్రాంతాల్లో చేశారో, ఎంత మందితో మాట్లాడారో కూడా అర్థం కావటం లేదు. ఇలా చేయడం అనుకూల మైనా, ప్రతికూలమైనా ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్న భయంతో నేతలు తలలు పట్టు కుంటున్నారు. కేవలం 5 వేలలోపు మందితో మాట్లాడి ఫలానా నియోజకవర్గం లో ఫలానా పార్టీదే విజయం.. పలనా అభ్యర్థే గెలుస్తున్నాడంటూ సర్వే రిపోర్టులను సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. కొన్ని యూట్యూబ్ చానెళ్లు వీటిని ప్రసారం చేస్తూ పోటీ చేస్తున్న అభ్యర్థులకు కొత్త తలనొప్పులు తెస్తున్నాయి. ఇందులో నిజమెంతో..అబద్ధమెంతో..అభూతకల్పనలు ఇంకెంతో తెలియక నేతలు అయోమయం చెందుతున్నారు. కొన్ని సర్వే ఏజెన్సీలు రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఎన్నికల సమయంలో విడుదల చేస్తూ ఇస్తున్నాయి. ఇక ప్రముఖ మీడియా చానెల్ సర్వే రిపోర్ట్ అంటూ సోషల్ మీడియాలో పార్టీలకు చెందిన మీడియా బాధ్యులు కూడా ఫేక్ సర్వే రిపోర్టులను రెడీ చేసి సర్క్యులేట్ చేస్తున్నారు. ఈ చానెల్స్ కు ఉన్న క్రెడిబిలిటీతో వీటిని పబ్లిక్ ను ఈజీగా నమ్మించవచ్చన్న ఉద్దేశంతో ఇలా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటివన్నీ ఫేక్ అని తెలిసినా ఎన్ఇనకల సంఘం ఇప్పటి వరు వీటిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రాష్ట్రంలో ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంలో కనీసంగా 15లక్షలకుపైనే ఓటర్లు ఉన్నారు. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజ్ గిరిలో అయితే సుమారు 32 లక్షల ఓటర్లు ఉంటారు. యూత్, మహిళలు, కార్మికులు, రైతులు, వృద్ధులు, డైలీ వర్కర్లు, సెటిలర్స్, ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వాళ్లు ఇలా ఎన్నో వర్గాల ఓటర్లు ఉండగా కేవలం 5వేల మంది శాంపిల్స్ తో సర్వే చేసి ఓటర్లు ఇలాగే జడ్జిమెంట్ ఇస్తున్నారని చెప్పటం ఎంతవరకు సబబు. ఇదంతా అభ్యర్థులను ప్రభావితం చేయడంతో పాటు, ఓటర్లను మాయలో పడేయమే అవుతుంది. ఇది కరెక్ట్ కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అన్ని వర్గాల ఓటర్లతో మాట్లాడకుండా, నియోజకవర్గంలో ఏం సమస్యలు ఉన్నాయి, గత ఎంపీలు ఏ సమస్యలు పరిష్కరించారో..కొత్తగా ప్రజలు ఎలాంటి పరిష్కారం కోరుకుంటున్నారో ఇందులో ప్రతిఫలించ డం లేదు. నేతలు ప్రజలకు అందుబాటులో ఉన్నారా లేదా అన్న ప్రశ్నలు లేకుండానే సర్వేలు వదులు తున్నారు.




ప్రస్తుత సర్వే రిపోర్ట్‌లు చూస్తుంటే ఇదంతా ఓ పద్ధతి ప్రకారం కొందరి మేలు కోసం చేస్తున్నా రన్న డొల్లతనం బయటపడుతోంది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇలాంటి ఉదాహరణలు ఎన్నో బయటకు వచ్చాయి. పోటీ చేయని పార్టీ అభ్యర్థి గెలుస్తున్నాడని సర్వే రిపోర్ట్ లు ఇవ్వడంతో అందరూ అవాక్కయ్యారు. ఇలాంటి ఫేక్ సర్వేలు, విశ్వసనీయత లేని సర్వేల వల్ల న్యూస్ ఏజెన్సీలకు విలువ ఉండటం లేదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఇంటెలిజెన్స్ పేరుతో కూడా ఫేక్ సర్వే రిపోర్ట్‌లు బయటకు వస్తున్నాయి. ఇక ఈ సర్వేలను ప్రముఖ న్యూస్ చానెల్స్ టెలికాస్ట్ చేసినట్లు కూడా వీడియోలు క్రియేట్ చేసి పార్టీల గ్రూప్ లలో సర్క్యులేట్ చేస్తున్నారు. దీంతో ఆయా చానెళ్ల యాజమాన్యాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం గట్టి నిర్ణయం తీసుకోవాలి. ఇలాంటి సర్వేలపై ఆంక్షలు విధించాలి. ప్రజలను తప్పుదోవ పట్టించే సర్వేలను బయటకు రాకుండా కట్టడి చేయాలి. లేకుంటే ప్రజాస్వామ్య భారంతలో వాటి వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొన్ని సార్లు ప్రతికూల ఫలితాలు కూడా రావచ్చు. ఈ ఎన్నికలకుముందే త్వరగా ఇలాంటి సర్వేలను నిషేధిస్తూ..ఎన్ఇనకల సంఘం నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే ప్రమాదం ఎదర్కోక తప్పదు.

నేటి కథ

## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను సబ్ స్క్రయిబ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి. mantalukathalu@gmail.com

## ఎర్ర కోడిపుంజు



రాములుది సింగారం అనే ఊరు. రోజూ పొలం పనులు చేస్తుంటడు. అతడు కోళ్లను పెంచుతుండు. రాములుకు ఆరు ఏండ్ల కొడుకు ఉన్నడు. అతని పేరు అనిరుద్. ఒకటవ తరగతి చదువుతుండు. అతనికి ఎర్రకోడిపుంజు చాలా ఇష్టం.రోజు దానికి నూకలు పోస్తడు. కోడిపుంజుతో ఆడుతడు.

రాములు పేదవాడు. పైసలు లేవు. అయితే ఒకరోజు చుట్టాలు వస్తున్నరని పక్కింటి రాజు కోడికావాలనీ వస్తడు.రాజుకు కోళ్ళను ఇయ్యడానికి వెతికితే దొరుకవు.ఎర్రకోడి పుంజు ఒకటి దొరుకుతుంది.రాములు దానిని రాజుకు అమ్ముతడు. బడినుండి అనిరుద్ వస్తడు. చీకటి పడుతుంది. కోళ్లు అన్ని వచ్చినయి. ఎర్రకోడిపుంజు మాత్రం రాలేదు. అనిరుద్ ఎదురుచూస్తడు.

ఇంటి ముందరికి వెనుకకి పోతడు. పెరడులో, ఎనుగుల్లో వెతుకుతడు. ఎటుపోయినా ఎర్రకోడిపుంజు దొరుకదు. అనిరుద్ వెక్కివెక్కి ఏడుస్తడు. అన్నం తినడు. పక్క ఇంటిలోని పిల్లలందరూ వచ్చిచుట్టూ చేరింద్రు. అందరూ బాధలో మునిగిపోయింద్రు. రాజు బంధువులు రాలేదని చూసి చూసి. తిరిగి ఎర్ర కోడిపుంజును రాములు ఇంటికి తెస్తాడు. కోడిపుంజును చూడగానే అనిరుద్ కళ్ళలో ఆనందం పొంగింది. అందరు ఆనందంతో పొంగిపోతారు.

డా.వాసరవేణి పరశురాం,
బాలసాహిత్య రచయిత

## ఎన్ని కలలో.. ఎన్ని కళలో..

ఎన్ని కలలో ఎన్ని కలలో
ఎన్నికల వేళ ఎన్నెన్ని కలలో
ఎన్ని హామీల సునామీలో
ఎన్ని వాగ్దాన ప్రవాహాలో

ఎన్ని కలలో మరెన్ని కలలో
ఎన్నికల వేళ ఎన్ని ఇంద్రజాలాలో
ఎన్ని కండువాల మార్పిడీలో
ఎన్నికల పండుగ కోలాహలాలో

ఎన్ని కలలో ఎన్ని కలలో
ఎన్ని కుల సమీకరణాలో
ఎన్ని సంకుల సమరాలో
ఎన్ని స్నేహ సంగమాలో

ఎన్ని కలలో ఎన్నికలలో
ఎన్ని కళలో ఎన్ని వలలో
ఎన్ని అలకలో ఎన్ని కలతలో
ఎన్ని తాయిలాల పంపకాలో

ఎన్ని ఆశలో ఎన్ని బాసలో
ఎన్ని మార్పులో ఎన్ని చేర్పులో
ఎన్ని కూర్పులో ఎన్ని నేర్పులో
ఎన్నెన్ని బుజ్జగింపులో ఎన్నెన్ని సయోధ్యలో

జాగ్రత్త ఓటరన్నా నోటు కన్నా ఓటు మిన్నా
బాగా ఆలోచించి మంచికి చోటివ్వుమన్నా
బాటిల్ బిర్యానీ ఆశల వలలో చిక్కకన్నా
ఆత్మాభిమానమే చంపుకుని హీనంగా బ్రతక కన్నా
ఓటు విలువే తెలుసుకుని విచక్షణతో మెలుగు
మన్నా

ప్రజాస్వామ్యం పచ్చని చెట్టు నడుకట్టి
రక్షించుమన్నా
ప్రతి ఒక్కరు భాధ్యతగా ఓటునే వెయ్యాలన్నా
ఓటనే వజ్రాయుధాన్ని ధీరుడవై ధరించుమన్నా
అభివృద్ధి సంక్షేమాలే దేశ ప్రగతికి సోపాన మన్నా



గుండాల నరేంద్రబాబు, తిరుపతి,
9493235992

# కొండగట్టు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కొండగట్టు ఏప్రిల్ 22( ప్రజా మంటలు)**
కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి చిన్న జయంతి ఉత్సవములకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం సాయంత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ దేవస్థానం లోని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాల ధారణ చేసుకొని వివిధ ప్రాంతాలనుండి వచ్చే హనుమాన్ భక్తులకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానం ఆచరించి స్వామివారి దర్శనానికి వెళ్లి వస్తు తిరిగి చేరుకోవడం జరుగుతున్నదని తెలిపారు. మహిళా భక్తులకు ప్రత్యేకంగా షవర్ లను, బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మాలధారణ ఏ విధంగా స్వచ్ఛమైన మనసుతో కాలినడకన వచ్చారో అదే స్ఫూర్తితో దర్శనం చేసుకొని వెళ్ళాలని భక్తులకు కోరారు. దేవుని ప్రసాదం కొరకు క్యూ లైన్ 12 కౌంటర్లను ఏర్పాటు చేశామని, అవసరం మేరకు మరిన్ని కౌంటర్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రత్యేక దర్శనం, మాల విరమణ, కేశఖండనం టికెట్ లకు ఆరు కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు సంయమనం పాటించి భక్తి శ్రద్ధలతో స్వామి వారి దర్శనం చేసుకోవాలని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నీడ పట్టున ఉంటూ, నీటిని ఎక్కువగా తాగాలని తెలిపారు. పారిశుధ్య పనులను, కోనేరు, కేశఖండనం, పోలీసు కంట్రోల్ రూం ను పరిశీలించారు. 114 సిసి కెమెరాలను ఈ సందర్భంగా ఆలయ పరిసరాలలో అమర్చడం జరిగిందని తెలిపారు. మొదటి రోజున సుమారు 30,000 మంది భక్తులు దర్శనానికి వచ్చారని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీఓ మధుసూదన్, డి.ఎస్.పి రఘు చందర్, ఆలయ ఈఓ చంద్రశేఖర్, జాతర ప్రత్యేక అధికారి కృష్ణ ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి దెవరాజ్, డిబి సిడిఓ సాయి బాబా, డి ఎస్ సిడిఓ రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి లక్ష్మి నారాయణ, వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## భక్తికి, సేవానిరతికి మారు పేరు

# భక్తాగ్రేసరుడు హన్మంతుడు

### చైత్ర పౌర్ణమి చిన్న హన్మాన్ జయంతి సందర్భంగా

హైందవ సంస్కృతిలో పెక్కు పండగలున్నాయి. అవి రుతుపర, మత ప్రమేయ, పురాణేతిహాస సంబంధమైనవి. అందు అసమాన భక్తాగ్రేసరుడు, ఆదర్శ పురుషుడు, నమ్మిన బంటు, సంస్కృతాద్యనేక భాషలు, వ్యాకరణాది శాస్త్రాలు, సంగీతాది కళలలో నిష్ణాతుడు. అయిన హనుమత్ జయంతి ప్రాశస్త్య మైనది.
అశ్వథామ బలిర్వ్యాస : హనుమాన్ శ్చ విభీషణ: కృప : పరశు రామశ్చ సప్తేతే చిరజీవిన : మార్కండేయస్తు అష్టమ: ప్రోక్త : అశ్వత్థామ, బలి చక్రవర్తి, వ్యాసుడు, హనుమంతుడు, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు, మార్కండేయుడు తదితరులను చిరంజీవులు గా భావిస్తారు.
ఒక కల్పం అంటే నాలుగు వందల ముప్పయి రెండు మిలియన్ల సంవత్సరాలు జీవించే ఎనిమిది మంది చిరంజీవులలో ఒకరైన హనుమంతుని జయంతి ప్రత్యేకత కలిగి ఉంది. భారతావనిలో వివిధ ప్రాంతాలలో హన్మాన్ జయంతిని వివిధ మాసాలలో జరుపు కుంటారు. ఆంజనేయుడు, హనుమంతుడు, హనుమాన్, బజరంగబలి, మారుతి, అంజనిసుతుడు వంటి ఎన్నో పేర్లతో హనుమంతుని ఆరాధిస్తారు. ఉత్తర భారత దేశంలో వారణాసిలో సంకట మోచన దేవాలయం, అయోధ్యలో హన్మాన్ గార్హి దేవాలయాలలో ఈ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో "మార్గళి" మాసం అనగా డిసెంబర్ లేదా జనవరిలలో జరుపు కుంటారు. ఒరియా క్యాలెండర్ ప్రకారం విషుభ సంక్రాంతి మొదటి రోజున వైశాఖంలో పాటించే ఆచారం ఉంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో వైశాఖ కృష్ణపక్ష మందు పెద్ద హన్మాన్ జయంతిగా జరుపుకునే సాంప్రదాయం ఉంది. చైత్ర పౌర్ణమి (చిన్న హన్మాన్ జయంతి)తో ప్రారంభించి, హన్మాన్ దీక్షలను వైశాఖ కృష్ణ పక్ష దశమి (పెద్ద హన్మాన్ జయంతి)కి ముగిసేలా 41రోజుల మండల దీక్షలను చేపట్టడం ఆనవాయితీగా, సాంప్రదాయ సిద్ధంగా వస్తున్నది.
ప్రధానంగా రామాయణంలో హనుమంతుని పాత్ర అద్వితీయం. రామాయణంలోని ఆరు కాండల్లోని చివరి మూడు కాండల్లో కథ నడిచిన మహనీయుడు హనుమంతుడు. హనుమంతుని స్తుతించే హనుమత్కవచాన్ని ఆంజనేయాలయంలో లక్ష ఇరవై అయిదు సార్లు పఠించిన వారికి గాలిలో ఎగిరే శక్తి, అణిమాద్యష్టసిద్ధులు లభ్య మవుతాయని నమ్మకం. ప్రేతపతి అయిన శివునికి ఎంత భూతాల మీద ఆధిపత్యం ఉందో హనుమంతునికి అట్టిది కలదని భావిస్తారు. పంచభూతాలను వశం చేసుకున్న పరమాత్ముడు అయన.. జ్ఞానేంద్రియాలను నియంత్రణలో ఉంచుకోగలిగిన మహాశక్తిశాలి. అందుకే గ్రహ పీడకు ఆంజనేయుని కొలుస్తారు. ఉన్మాద రోగాలకు ఆంజనేయ ప్రదక్షిణలు చేస్తారు. చిన్న పిల్లలకు ఆంజనేయ బొమ్మ చెక్కిన యంత్రపు బిళ్ళలను మెడలో కడుతారు. పిల్లలు, పెద్దలు ఆపత్సమయాలలో, భయం కలిగే వేళలలో ఆంజనేయ దండకం చదువడం చిరకాలంగా అనుసరిస్తున్న సంప్రదాయం. శివాజీ గురువైన సమర్థ రామదాసు హనుమంతుని భక్తుడు కాగా, మహారాష్ట్రుల జెండా మీద గదాపాణియైన హనుమంతుడు ఉంటారు. పాండవ మధ్యముడైన అర్జునుని జెండాపై ఉపవిష్ణుడై హనుమంతుడు మహా భారత యుద్ధంలో అర్జునునికి రక్షణగా ఉన్న గాధ అందరికీ తెలిసిందే.
హనుమంతుడికి స్వర్గ ప్రాప్తి లభించినా, పవనసుతుడు అందుకు అంగీకరించక, తాను భూమిపైనే రాముడి భక్తుడిగా కలకాలం ఉండిపోతానని కోరుకుంటాడు. అందుకు శ్రీ రాముడు కూడా ఒప్పుకుంటాడు. ఈ కారణంగానే భూమిపై రాముడిని ఇప్పటికీ భజనలు, కీర్తనలతో కొలుస్తున్నారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఆంజనేయుడు, అవతార పురుషుడు అయిన శ్రీ రాముడినే తన హృదయంలో బంధించి భక్తిలో ఎవరికీ సాటి లేదని చాటాడు. హనుమంతుడు సీతా రాముల దాసునిగా, రామ భక్తునిగా, విజయ ప్రదాతగా, రక్షకునిగా హిందూ మతములో అత్యంత భక్తి శ్రద్ధలతో కొలువ బడే దైవంగా నిత్య పూజలు అందు కుంట ున్నాడు. ప్రతి గ్రామానికీ ఆయన క్షేత్ర పాలకుడు. అంటే గ్రామ రక్షకుడు.



భగవద్దాసులలో సాటిలేని ఆంజనే యుని పూజకు ఉద్దిష్టమైన చైత్ర పూర్ణిమతోపాటు, వైశాఖ బహుళ దశమి నాడు కూడా ప్రత్యేక ఆర్చనలు, పూజాదులు నిర్వహించడం సదాచార సాంప్రదాయంగా వస్తున్నది. రావణుని బారి నుండి శనిని ఆంజనేయుడు కాపాడుతాడు. అందుకు రుణపడిన శనీశ్వరుడు.. హనుమంతుడిని సేవించేందుకు ఉద్యుక్తుడవుతాడు. అయితే తన భక్తులకు శని ప్రభావం లేకుండా చూడాలని శనీశ్వరుడిని హనుమ అడుగుతాడు. అప్పటి నుంచి హనుమంతుడిని కొలిచేవారిపై శని చెడు ప్రభావం ఉండదనే విశ్వాసంతో, శని దేవుని పూజించేవారు తప్పనిసరిగా అంజన్నను కొలుస్తారు. అంతేకాదు హనుమాన్ చాలీసా రోజూ పఠిస్తే శని చెడు ప్రభావం సోకదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494



నిజామాబాద్ లో నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టి. జీవన్ రెడ్డీ నామినేషన్ వేసిన సందర్భంగా జగిత్యాల నుండి తరలివెల్లి బహిరంగ సభలో పాల్గొన్న పలువురు కాంగ్రెస్ నాయకులు..





నిజామాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గా టి. జీవన్ రెడ్డి నిజామాబాద్ లో నామినేషన్ వేస్తున్న సందర్భంగా వాణీ నగర్ ఆర్య వైశ్యుల కాన్వాయి ని జెండా ఊపి ప్రారంభించిన మాజీ మున్సిపల్ చైర్మన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి

## గురుకుల స్టూడెంట్స్కు గాంధీలో మెడికల్ సర్టిఫికెట్లు
### గాంధీ సూపరింటెండెంట్ ఔదార్యం

**సికింద్రాబాద్ ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** బోయిగూడ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్లు సంపాదించారు. వారికి మెడికల్ ఫిట్ నెస్ సర్టిఫికెట్లు అవసరం ఉండగా గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు వారికి బ్లడ్ గ్రూపింగ్ చేయించి, సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా పిల్లల కాళ్లకు చెప్పులు లేకపోవడం



గమనించిన రాజారావు వారందరికి షూలు కొనేందుకు ఆర్థిక సాయం అందించారు. పిల్లల పేరెంట్స్ సూపరింటెండెంట్ కు కృతజ్ఞతలు తెలిపారు.



మెట్ పల్లి పట్టణంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ హనుమాన్ ర్యాలీ సాయంత్రం ఆరపేట శివాలయం నుండి అయ్యప్ప దేవాలయం వరకు ఘనంగా భారీ హనుమాన్ దీక్ష స్వాములు, హిందూ బంధువులతో ఘనంగా జరిగింది.

## ‘మే డే’ ను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్ విడుదల
### ఏఐటీసీయు హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్

**భీమదేవరపల్లి ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** 75 సంవత్సరాల భారతావని చరిత్రలో కార్మికుల పోరాటం, త్యాగాల ఫలితంగా 44 కార్మిక చట్టాలను, 29 చట్టాలుగా రద్దు చేసి సాధించుకున్న



సందర్భంలో మే డే వేడుకలను విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముల్కనూర్ గ్రామపంచాయతీ కార్మికుల సమక్షంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, న్యాయమైన పెన్షన్ ఇవ్వాలని అన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులను గుర్తించి, ఐక్యంగా పోరాటాలు, ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆదరి రమేష్, కౌన్సిల్ మెంబర్ శనిగరపు రాజకుమార్, ఉపాధ్యక్షులు నకిర్త ఓదేలు, మండల అధ్యక్షులు చిటుకూరి రాజయ్య, వంగ సారయ్య, మాడుగుల బాబు, గుడికందుల వెంకటరాజం, గొట్టే బాబు, ఏం. రాజేష్, వేముగంటి రాజేష్, మాడుగుల రాధ, మాట్ల రుద్రయ్య, బోయిని సంపత్, మూల రంజిత్, మాడుగుల రాజేందర్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ

**చిగురుమామిడి ఏప్రిల్ 22 ( ప్రజామంటలు):** చిగురుమామిడి మండలంలోని టీసెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మనపల్లి, చిగురుమామిడి కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి డి.ఆర్.డి.ఓ – డి.ఆర్.డి.ఏ. వుప్పల శ్రీధర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు నాణ్యమైన వరి ధాన్యం తీసుకు వచ్చి





ప్రభుత్వ మద్దతు రూ. 2203 ధర పొందాలని కోరారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విదంగా రైతు ధాన్యాన్ని కొనుగోలు రికార్డులు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాల్సిందిగా సెంటర్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సిహెచ్ ప్రవీణ్, ఏపీఎం లు మారపల్లి రాజేష్, మట్టెల సంపత్, సీసీలు వెంకటమల్లు, సత్యనారాయణ, కమిటీ సభ్యులు, విఓఏలు రజిత, నిర్మల, చైతన్య, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

## ఘనంగా శత చండియాగం

**ధర్మపురి ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** శ్రీ సాయి నరసింహ ప్రాజెక్ట్ వారిచే సోమవారం రాయపట్నం రోడ్డు ధర్మపురిలో శత చండి యాగం ప్రారంభం అయింది. తొలి రోజు ఉదయం గణేశ పూజ, పుణ్యాహ వాచనం, దీక్షావరణం యాగశాల





ప్రవేశం, చండి పారాయణములు, వాస్తు, నవగ్రహ, యోగిని, క్షేత్ర పాలక, సర్వేతోభద్ర, మండల స్థాపన పూజలు, ప్రధాన కలశ స్థాపన, మధ్యాహ్నము గణేశ హెూమం, చండీ పారాయణములు ప్రారంభం జరిగింది. ఈ నెల 24వ తేదీన పూర్ణాహుతి అన్నదానం జరుగునని ట్రస్ట్ బాద్యులు వొజ్జల ప్రవీణ్ శాస్త్రి స్వాతి తెలిపారు.

## వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ నగదు
### 15 లక్షల నగదు సీజ్
### సరైన ఆధారాలు లేనిది 50 వేలు మించి తీసుకెళ్లదు - ఏసీపీ శ్రీనివాస్. జీ

**జమ్మికుంట ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** ఎన్నికల నేపథ్యంలో జమ్మికుంట గ్రేన్ మార్కెట్ రోడ్డులో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా పొనగంటి సురేష్ జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మోతుకుల




గూడెం కు చెందిన వ్యక్తి వద్ద 15 లక్షల రూపాయలు నగదు పట్టుబడినవని హుజురాబాద్ డివిజన్ ఏసిపి శ్రీనివాస్ జి, జమ్మికుంట పట్టణ సీఐ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ జి. మాట్లాడుతూ.... ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి 50వేల రూపాయల కంటే ఎక్కువ కలిగి ఉండటం వలన పొనగంటి సురేష్ వద్ద 15 లక్షల రూపాయలు వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకొని, వారిని తదుపరి విచారణ చేయగా నగదును సంబంధించిన సరైన ఆధారాలు చూపని కారణంగా దొరికిన సొమ్మును సీజ్ చేసి సంబంధిత అధికారులకు నగదును అప్పగిస్తున్నట్లు తెలిపారు.

## కస్తూర్బా విద్యార్థులకు కంటి పరీక్షలు



**గొల్లపల్లి ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు సోమవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 124 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. నలుగురు విద్యార్థులకు కంటి కళ్ళజోళు ్ళ అందజేయనున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ. శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థి దశ నుండి కంటి చూపు పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు .ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారి డాక్టర్ ఎన్. నరేష్ , ఆప్తాల్మిక్ అధికారి తిరుపతి, సిహెచ్ఓ శ్రీధర్ వైద్య సిబ్బంది, కస్తూర్బా ప్రిన్సిపల్ పద్మ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా కొంక హరిబాబు

**హసన్ పర్తి ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** వర్ధన్నపేట నియోజకవర్గం 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా కొంక హరిబాబు కు నియామక పత్రాన్ని



అందజేసిన వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మన్నె రాంబాబు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రుద్రరోజు మనింద్రనాథ్, జనప సారంగపాణి, భూక్య విజయ్ కుమార్, చిలువేరు శ్యాంబాబు, కాంగ్రెస్ మహిళా సీనియర్ నాయకురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో ‘ఎడిఎంఎస్ ఈ బైక్స్’ ప్రారంభోత్సవం ప్రారంభించిన రచ్చ శ్రీనివాస్ రావు

**జమ్మికుంట ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ హై స్కూల్ సమీపంలో మల్లికార్జున ఎలక్ట్రానిక్ బైక్ షోరూంను ఎడిఎంఎస్ ఈ బైక్స్ ఆల్ ఇండియా కోర్ కమిటీ మెంబర్ రచ్చ శ్రీనివాస రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజలందరూ తప్పకుండా ఎలక్ట్రానిక్ ఈ బైక్ ను వాడాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాల వలన పొల్యూషన్ రోజురోజుకు పెరిగిపోయి గాలి కాలుష్యం పెరగడంతో శ్వాస సంబంధ రోగాల బారిన పడి అనేక మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2030 నాటికి దేశం అంతటా పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించే ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రభుత్వమే ప్రమోట్ చేస్తున్నాయి అన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాల వల్ల కచ్చితంగా తక్కువ ఖర్చుతో ప్రయాణం చేయవచ్చు అన్నారు. సామాన్య ప్రజలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జమ్మికుంటలో మల్లికార్జున ఎలక్ట్రానిక్ బైక్స్ షోరూం మేనేజర్ చెరుకు పైడయ్య ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## కాలినడకన వచ్చే కొండగట్టు అంజన్న భక్తులకు త్రాగునీరు, అరటిపండ్లు, మజ్జిగ పంపిణీ చేసిన ముసిపట్ల దేవేందర్ కుటుంబ సభ్యులు

**జగిత్యాల ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో చిన్న జయంతి ఉత్సవాలు ఈరోజు నుండి ప్రారంభమయ్యాయి. 3 రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు తెలంగాణ తోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, చతిస్గఢ్ రాష్ట్రాల నుండి దాదాపు 3 లక్షలకు పైగా దీక్షాపరులు మరియు సాధారణ భక్తులు అంజన్న దర్శనానికి వస్తున్నారు. కాలినడకన వచ్చే భక్తులకు జగిత్యాల పట్టణానికి చెందిన ముసిపట్ల వెంకట రమణయ్య, వెంకట లక్ష్మీ జ్ఞాపకార్థం వారి కుమారుడు, జయశ్రీ ప్రింటర్స్ అధినేత ముసిపట్ల దేవేందర్, అతని సతీమణి భాగ్యలక్ష్మి, కూతురు కౌముది లు త్రాగునీరు, అరటిపండ్లు, మజ్జిగ ను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం చిన్న జయంతి మరియు పెద్ద జయంతి సందర్భంగా సేవ చేస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా త్రాగునీరు, అరటిపండ్లు, మజ్జిగ ను అందిస్తుండటం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి నామినేషన్ వేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి తన నామినేషన్ దాఖలు చేసి అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలకు ఎంపికైన
# విజయసాయి స్కూల్ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామం లోని విజయసాయి స్కూల్ విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ అబ్బా సురేష్ తెలిపారు.



4వతరగతి చదువుతున్న వర్దన్, సాత్విక్, తనిషా బాను, రోహిత్, శశి, ఐశ్వర్య, ప్రియ, మాధుర్య లు గురుకుల పాఠశాల ఎంపీక కోసం 5 వతరగతి ప్రవేశం కోసం పరీక్షలు రాయగా ఫలితాలలో సీట్లు సాదించారని సురేష్ తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను , తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.

# భూవివాదంలో మీడియటర్ గా వ్యవహరిస్తున్న గ్రామ కార్యదర్శి పై కలెక్టర్‌కు ఫిర్యాదు

**మెట్టుపల్లి ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** మేడిపల్లి (ప) గ్రామంలోని తన స్థలంలో తన నిర్మాణానికి అనుమతి కోసం వెళ్తే అనుమతి ఇవ్వకుండా, పైగా ఈ స్థలంలో అభ్యంతరం తెలిపిన వారితో రాజీ చేసుకో అంటూ ఉచిత సలహా ఇవ్వడంతో పాటు, మధ్యవర్తిత్వం వహించిన మేడిపల్లి గ్రామ కార్యదర్శి పై అదే గ్రామానికి చెందిన బాధితురాలు అడెపు సౌమ్య జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసింది. వివారాల్లోకి వెళ్తే మెట్ పల్లి మండలం మేడిపల్లి పడమర గ్రామానికి చెందిన ఆడెపు సౌమ్య తన స్థలంలో షటర్ నిర్మాణం కోసం టీయస్ బిపాస్ ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోగా, గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం వాళ్ళు అభ్యంతరం తెలుపుతున్నారు అంటూ గ్రామ కార్యదర్శి అనుమతి పత్రాన్ని పెండింగ్ లో పెట్టింది. మున్నూరు కాపు సంఘం వారు ఎందుకు అభ్యంతరం తెలుపుతున్నారో, వారి వద్ద ఉన్న ఆధారాలు, పత్రాలు తనకి ఇవ్వకపోవడంతో సౌమ్య సివిల్ కోర్టుకి వెళ్లి వారిపై ఇంజెంక్షన్ ఆర్డర్ సైతం పొందింది. కోర్టు కేసుకి నిరసనగా అట్టి స్థలంలో సిమెంట్, ఇటుకల్ని తొలగించిన మున్నూరు కాపు సంఘ సభ్యులపై ఏప్రిల్ 12 న పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కూడా ఆమెకి ఎలాంటి న్యాయం చేయలేకపోయారు. చివరకు కోర్టు అనుమతితో సౌమ్య తన స్థలంలో తాను పిల్లర్ల నిర్మాణం కోసం గుంతలు తవ్వుకోగా, తవ్విన గుంతలు పూడ్చివేయాలంటూ, లేదంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కార్యదర్శి ఈ నెల 18 న నోటీసు పంపడంతో గత్యంతరం లేక తాను ఏకపక్షంగా వ్యవహరించిన ఆమెపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి తనకి న్యాయ చేయాలని కలెక్టరుకి ఫిర్యాదు చేశానని బాధితురాలు చెప్పింది.



తేది : 22-04-2024

శ్రీయుత గౌరవనీయులైన కలెక్టర్, జగిత్యాల గారికి...

నేను అనగా ఆడెపు సౌమ్య ,W/o రాజేష్, R/o మేడిపల్లి ( ప ) గారిని, నాకు మేడిపల్లి ( ప ) గ్రామములో రెండు ఇండ్లు, ఇంటి నెంబర్లు 4-121 మరియు 4-122 లు కలవు. ఇట్టి ఇండ్లు ( కుల్చివేయబడినవి ) నేను డాక్యుమెంట్ నెంబర్ 1647/2022 మరియు 3981/2022 ద్వారా కొనుగోలు చేసి మరియు రిజిష్ట్రేషన్ చేయించుకున్నాను. కూల్చివేయబడిన ఇట్టి ఇంటి నెంబర్ 4-121 లో కొత్తగా షటర్ నిర్మాణం కోసం తేది : 27-01-2024 రోజున TS BPASS తో దరఖాస్తు చేసుకున్నాను. అయినప్పటికీ మా మేడిపల్లి ( ప ) గ్రామ కార్యదర్శి, మున్నూరు కాపు సంఘం సభ్యులు అభ్యంతరం చేస్తున్నారని నాకు షటర్ నిర్మాణం కోసం అనుమతిని మౌఖికంగా నిరాకరిస్తూ వచ్చారు. మా గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం వాళ్లకి అట్టి స్థలంపై ఎలాంటి హక్కులు కానీ పత్రాలు కాని లేకపోయినప్పటికీ, గ్రామ కార్యదర్శి గారు మున్నూరు కాపు సంఘం వైపు మాట్లాడి నాకు పర్మిషన్ నిరాకరించారు. అనంతరం నేను O.S No. 23/2024 ద్వారా మెట్ పల్లి సివిల్ కోర్టు లో మున్నూరు కాపు సంఘం సభ్యులపై ఇంజంక్షన్ ఆర్డర్ సైతం తీసుకున్నాను. అనంతరం మా పైనే కోర్టులో కేసు వేస్తావ అంటూ నా షటర్ నిర్మాణం కోసం సిద్ధం చేసుకున్న సిమెంట్ మరియు ఇటుకల్ని ధ్వంసం చేయగా, తేది :13-04-2024 రోజున మున్నూరు కాపు సంఘం సభ్యుల పై ఇబ్రాహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాను. అయినప్పటికీ పోలీసులు కూడా నాకు ఎలాంటి న్యాయం చేయలేకపోయారు. అనంతరం నేను తేది :16-04-2024 రోజున షటర్ నిర్మాణం కోసం నా యొక్క స్థలంలో గుంతలు తవ్వగా, నేను తవ్విన గుంతలు మూసివేయాలని లేకుంటే పంచాయతి రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తేది :18-04-2024 రోజున మేడిపల్లి (ప) గ్రామ కార్యదర్శి గారు నాకు ఒక నోటీసు అందించారు. కాని అట్టి నోటీసుతో పాటు మున్నూరు కాపు సంఘం వాళ్ళు చేసిన ఎలాంటి ఫిర్యాదు పత్రం కాని, వారి వద్ద ఉన్న ఎలాంటి ఆధారాలు కానీ డాక్యుమెంట్లు కానీ అందించలేదు. మరియు తేది :18-04-2024 నాటి కార్యదర్శి గారు అందించిన గ్రామ పంచాయతి నోటీసు పై ఎలాంటి జీపి నెంబరు కూడా లేదు. కావున నా యొక్క స్థలానికి సంబంధించి అభ్యంతరం తెలుపుతున్న మున్నూరు కాపు సంఘం సభ్యుల వద్ద ఎలాంటి ఆధారాలు మరియు ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోయినప్పటికీ, వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకుని వాళ్ళకుఅనుకూలంగా మాట్లాడుతూ నాకు అనుమతిని నిరాకరించడమే కాకుండా, వారితో రాజీ చేసుకోవాలని నన్ను బెదిరించిన మేడిపల్లి ( ప ) గ్రామ కార్యదర్శి గారి పై విచారణ చేసి, ఆమెపై చర్యలు తీసుకుని నాకు అనుమతిని ఇప్పించి, న్యాయం చేయగలరని నా యొక్క మనవి.

జతపరచినవి..
1. గ్రామ పంచాయతి నోటీసు.
2. అనుమతి దరఖాస్తు.
3. పోలీస్ స్టేషన్ దరఖాస్తు.
4. కోర్టు ఆర్డర్ కాపీ.

ఇట్లు
ఆడెపు సౌమ్య W/o రాజేష్.
R/o మేడిపల్లి (ప), మెట్ పల్లి మండలం.
సెల్ నెంబర్ : 7893662462.

# కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వెలిచాల రాజేందర్ రావు

ఉద్యమాలకు ఊపిరి పోసిన కరీంనగర్ గడ్డ

ఏందరో మేధావులను పార్లమెంట్ కి పంపిన కరీంనగర్ అడ్డ

కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం అంటూ కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు




**కరీంనగర్ ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ శాసనసభ్యులు సభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ గారు, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారు, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం హుజురాబాద్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జిలు వోడితల ప్రణవ్ గారు, పురుమల్ల శ్రీనివాస్ లతో కలిసి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు నామినేషన్ దాఖలు సిగేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ నగరంలోని జ్యోతిబా పూలే మైదానం నుండి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కార్యకర్తలు అభిమాను లు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు.



## మెప్మా ఆధ్వర్యంలో ఓటర్ అవగాహనలో భాగంగా మెహెంది

**జగిత్యాల ఏప్రిల్ 16 (ప్రజామంటలు):** జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లాలోని మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో ఓటరు అవగాహనలో భాగంగా స్వయం సహాయక బృందాలతో మెహెంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమీషనర్లు, మెప్మా ఏ. ఓ. శ్రీనివాస్ గౌడ్, డిఎంసి సునీత, టీఎంసి రజిత , శివ , జాలెందర్, రాము, సిఓ లు సంధ్య, రాధ, జ్యోతి పల్లవి, శరణ్య టిఎల్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**సారంగాపూర్ /బుగ్గారం ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** నాణ్యత గల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. సోమవారం రోజున సారంగాపూర్, బుగ్గారం మండలాల్లోని యశ్వంత్ రావుపేట, బట్టపల్లి, పోతారం గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ా%. రైతుల నుండి కొనుగోలు చేసే వరి పంటను నాణ్యత గల వరి ని కొనుగోలు చేయాలని కేంద్రం ఇంఛార్జి లను ఆదేశించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్టర్ లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తరుణంలో నీడ ఏర్పాటు చేయాలని, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. ఆయన వెంట ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్, తదితరులు ఉన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎంపీడీవో వీరేశం

**భీమదేవరపల్లి ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ విద్యాశాఖ ద్వారా జరిగే అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు మినహాయింపు ఉన్నందువల్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎన్. వీరేశం సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాలలో అవసర మైన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలైన తాగునీటి సౌకర్యాలు, విద్యుత్, చిన్న చిన్న పనులను వీలైనంత తక్కువ ఖర్చుతో పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి, ముల్కనూర్, వంగర, రంగయ్యపల్లి గ్రామాలలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈపిఆర్ సంతోష్, వంగర పంచాయతీ సెక్రటరీ గుడికందుల మధు, ఏపీఎం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, వివోల అధ్యక్షులు పాల్గొన్నారు.





## ఘనంగా వీడ్కోలు సమావేశం

**ధర్మపురి ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** మండలం ఆరెపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయులు బెజ్జంకి నితిన్ కుమార్ మాట్లాడుతూ.... పిల్లలకు మంచి పునాది ఇవ్వడంలో శక్తి వంచన లేకుండాకృషి చేశామని వారు గొప్పస్థాయికి ఎదిగి భవిష్యత్ లో మన పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆశాభావం వ్యక్తపరిచారు. అనంతరం నృత్యాలతో, గీతాలతో, విద్యార్థులు తమ తమ భావాలను వ్యక్తపరచు కున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మ్యాన పవన్ కుమార్ గుగ్గిల సరోజ దుంపేట చామంతి, అంగన్వాడీ కామేర శాంతి, లక్ష్మీ కాంత తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో 13 గంటల రామనామ తారక మంత్రం పఠనం

**జగిత్యాల ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళ వారము జరిగే హనుమాన్ జయంతి ని పురస్కరించుకొని 13 గంటల పాటు నిర్విరామముగా జరిగే అఖండ రామ నామ జపము ఉదయం 8:00 గంటలకు ప్రారంభమయ్యింది. లక్ష్మి గణేష్ మందిరం సత్సంగ సభ్యులచే ప్రారంభ మైన రామ నామ తారక మంత్రము రాత్రి 9:00 గంటల వరకు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంక రించిన వేదిక పై నిలిపి అభి శేకం, అలంకరణ చేశారు. మాతలు రామ నామ తారక మంత్రము జపిస్తూ నృత్యాలు చేశారు. ఈనాటి కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బట్టు సుధాకర్, కొత్త మోహన్, వీరబత్తిని శ్రీనివాస్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, కొత్తపెల్లి శ్రీనివాస్, నాగభూషణం, అనంతుల ప్రేమ్, రావి కంటి రాములు, ఎర్ర రంజిత్, నూనె రాధ కిషన్, మానుక సంతోష్, కె.ఎల్.వి. క్రిష్ణ, ఉటూరి ఉమాపతి, బొనగిరి వాసు, మాతలు, భక్తులు పాల్గొన్నారు.



## కొండగట్టు అంజన్నను దర్శించుకుని ముడుపు కట్టిన భారాస ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి

**కొండగట్టు ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** ప్రముఖ కొండగట్టు అంజన్న పుణ్యక్షేత్రంలో ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అనంతరం ముడుపుకట్టిన నిజామాబాద్ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ,పాల్గొన్న జగిత్యాల శాసన సభ్యులు డా.సంజయ్ కుమార్ , మాజీ మంత్రి రాజేశం గౌడ్. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్,ఎంపి అభ్యర్థి బాజీ రెడ్డి గోవర్ధన్, రాజేశం గౌడ్ ని ఆలయ అర్చకులు స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి, ఆశీర్వదించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనార్టీ నాయకుడు ఫజల్ రహమాన్

**జమ్మికుంట ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ ఫజలుల్ రహమాన్ తో పాటు ఆ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పోలు బిక్షపతి,పోలు వెంకటేష్, రామన్నపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గొర్నకొండ రాజు గార్లు ఈ రోజు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నివాసములో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఫజలుల్ రహమాన్ మాట్లాతూ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ గారి నాయకత్వంలో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీకి పేరు ప్రతిష్టలు తీసుక వస్తామని, కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యతలు అప్పచెప్పిన సమర్థవంతంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలి వర్కర్స్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు ఓల్లాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ హుజురాబాద్ నియోజకవర్గ నాయకుడు మహమ్మద్ సలీం పాషా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారపల్లి శ్రీనివాస్, మేడి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ అన్యువల్ డే

**హుజురాబాద్ ఏప్రిల్ 22 (ప్రజామంటలు):** హుజురాబాద్ మండలం రెండవ వార్డు, స్థానిక అంగన్వాడి కేంద్రం అయినా గణేష్ నగర్ లో ఈరోజు ప్రెస్ స్కూల్ ఆన్యువల్ డే నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో హాజరైన (సిడిపిఓ) తిరుమల , అంగన్వాడి కేంద్రం ప్రక్కన ఉన్న ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం. ప్రభాకర్, స్థానిక అంగన్వాడి కేంద్ర టీచర్ కొలిపాక అంజలి, ఆయా కొండపాక స్వప్న, తల్లులు, గర్భవతులు, బాలింతలు విద్యార్థులు విద్యార్థినులు, ప్రీ స్కూల్ అన్యువల్ డే కార్యక్రమానికి హాజరు అయినారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లల యొక్క నైపుణ్యతను వారి వారి తల్లుల ముందు కనపరచి వారికి వ్రాత పరీక్షలు నిర్వహించి ఇవ్వడం జరిగింది. కార్యక్రమానికి హాజరైన తల్లులకు, పిల్లలకు మరియు అంగన్వాడి కేంద్రానికి ఇట్టి సేవలను ఎల్లప్పుడూ జరిపే విధంగా చేయాలని, హుజురాబాద్ సిడిపిఓ మేడం ఇలాంటి సేవలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఈ ప్రీ స్కూల్ అన్యువల్ డే కార్యక్రమం ద్వారా వారు కోరారు. ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు గాను స్థానిక అంగన్వాడి కేంద్ర ఉపాధ్యాయురాలు కొలిపాక అంజలి పేరుపేరునా ప్రతి ఒక్కరికి వారి కృతజ్ఞతలు తెలియజేశారు.



# తిరుమణ్ణామలైలో నేడు గిరి ప్రదక్షిణం
## చిత్ర పౌర్ణమి సందర్భంగా భారీ ఏర్పాట్లు

చెన్నై,ఏప్రిల్ 22 (ప్రజా మంటలు): ఈ నెల 23వ తేదీ పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణకు భారీ ఏర్పాట్లు చేశారు. అలాగే, అరుణాచలేశ్వర స్వామిని దర్శించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 25 లక్షల మంది భక్తులు రావొచ్చని జిల్లా యంత్రాంగంతో పాటు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా తిరువణ్ణామలైకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సులు నడిపేలా రవాణాశాఖ దృష్టిసారించింది. ముఖ్యంగా, రాజగోపురం ప్రవేశద్వారం నుంచి ఆలయంలోకి అడుగుపెట్టే భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం కూడా ఏర్పాటుచేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. గిరిప్రదక్షిణ చేసేందుకు 23వ తేదీ వేకువజామున 4.16 నుంచి 24వ తేదీన తెల్లవారుజామున 5.47 గంటల వరకు శుభ సమయమని ఆలయ అధికారులు తెలిపారు. అయితే, 23వ తేదీ మంగళవారం పగటిపూట గిరి ప్రదక్షిణ చేసే భక్తులు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా, గిరిప్రదక్షిణ సాగే 14 కిలోమీటర్ల కొండ చుట్టూ గుర్తింపు కార్డులు, ముందస్తు అనుమతి పొందిన వారే అన్నదానాలు చేయాలని ఆయన కోరారు. 23వ తేదీ చిత్ర పౌర్ణమి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 1200 బస్సులు నడిపేలా రవాణా శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం తిరువణ్ణామలై పట్టణంలో 9 తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశారు. చెన్నై నుంచి తిరువణ్ణామలై వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్సులను దిండివనం బైపాస్ రోడ్డులో పార్కింగ్ చేసేలా ఏర్పాట్లుచేశారు. సేలం, తిరుపత్తూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల బస్సులు చెంగం రోడ్డులో పార్కింగ్ చేసేలా, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే బస్సులు వేంగికాల అన్నా జంక్షన్ వద్ద పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే, చెన్నై, వేలూరు, విల్లుపురం ప్రాంతాల నుంచి తిరువణ్ణామలైకు నడిపే ప్రత్యేక రైళ్ళ వివరాలను సోమవారం ప్రకటించనున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఆటోల సహా ఇతర వాహనాలను అనుమతించరని పోలీసులు తెలిపారు. దివ్యాంగులకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు.



# కేరళలో బర్డ్‌ఫ్లూ కలకలం
### అప్రమత్తం అయిన ప్రభుత్వం
### కోళ్ల దిగుమతులపై ఆంక్షలు



తిరువనంతపురం,ఏప్రిల్ 22 (ప్రజామంటలు): కేరళ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ స్వైర విహారం చేస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేరళ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాలపై నిఘా వేశారు. ముఖ్యంగా కేరళ నుంచి కోళ్ళ దానా, కోళ్ళ ఉత్పత్తులు, కోడిమాంసం, కోడిగుడ్లు వంటివి సరఫరా కాకుండా అడ్డుకుంటున్నారు. కేరళ రాష్ట్రంలోని ఆలప్పుళా జిల్లాలోని కుట్టనాడులో బర్డ్‌ఫ్లూ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులు వచ్చిన కిలోమీటరు దూరంలోని కోళ్ళఫారాల్లో కోళ్ళతో పాటు కోళ్ళ ఉత్పత్తులను నిర్వీర్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేరళ రాష్ట్ర సరిహద్దులకు ఆనుకునివున్న గ్రామాల్లో నిఘా పెట్టారు. ఇందులో భాగంగా రెండు రాష్ట్రాల మధ్య ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కేరళ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే సరకు రవాణా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కేరళ నుంచి రాష్ట్రానికి వచ్చే అన్ని రకాల కోళ్ళ ఉత్పత్తులను తిప్పి పంపుతున్నారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కేసులు ప్రబలకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, కూరగాయలు, ఇతర కిరాణా సరకులతో వచ్చే వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నారు. ఈ వాహనాల టైర్లకు క్లోరిన్ డై ఆక్సైడ్ అనే రసాయనాన్ని పిచికారి చేస్తున్నారు. ఇందుకోసం ఒక పశుసంవర్ధక శాఖ అధికారి, ఒక అసిస్టెంట్, క్రిమి సంహారిణి పిచికారి చేసే ఇద్దరు సిబ్బంది సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు నిత్యం విధుల్లో ఉంటున్నారు. కేరళ నుంచి కన్నియాకుమారికి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు వీలుగా కుమరి జిల్లా సరిహద్దుల్లో కూడా ప్రత్యేక చెక్ పోస్టులను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. పదందాలుమూడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో గట్టి నిఘా పెట్టారు. ఇక్కడ మూడు బృందాలుగా పశుసంవర్ధక శాఖ అధికారులు డ్యూటీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో కోళ్ళపరిశ్రమకు పెట్టింది పేరైన నామక్కల్‌లోని కోళ్ళఫారాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అన్ని కోళ్ళఫారాల వద్ద క్రిమిసంహార మందులను పిచికారి చేస్తున్నారు. ఈ ఒక్క జిల్లాలోనే దాదాపు ఆరు కోట్ల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ కోళ్ళఫారాలకు దాణా తీసుకొచ్చే వాహనాల టైర్లకు క్రిమి సంహార మందు పిచికారి చేసిన తర్వాతే లోనికి అనుమతిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు కూడా నమోదు కాలేదని కోళ్ళఫారం యజమానులు అభిప్రాయపడుతున్నారు.

# ఎన్నికల ముందు మమతకు భారీ షాక్
### 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ రద్దు
### కోల్‌కతా ఐకోర్టు సంచలన తీర్పు



కోల్‌కతా,ఏప్రిల్ 22 (ప్రజా మంటలు): పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ నియామక పక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. అంతేగాక, దీని కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక పక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక పక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ పిటిషన్లపై విచారణ నిమిత్తం కోల్‌కతా హైకోర్టులో ప్రత్యేక డివిజన్ బెంచ్ ఏర్పాటైంది. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన ఈ ధర్మాసనం.. 2016 నాటి టీచర్ల నియామక పక్రియలో అవకతవకలు జరిగినందున అది చెల్లదని తీర్పు వెలువరించింది. తక్షణమే ఆ నియామకాలను రద్దు చేసి కొత్త నియామక పక్రియ ప్రారంభించాలని పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌ను సూచించింది. నాటి వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరిపి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో 2016 ఉపాధ్యాయ నియామక పక్రియతో ఉద్యోగాలు పొందిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నాలుగు వారాల్లోగా తాము అందుకున్న వేతనాలను తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. ఆ డబ్బు వసూలు బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని సూచించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత పార్థా ఛటర్జీ ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అయితే కోల్‌కత్తా హైకోర్టు తీసుకున్న తాజా నిర్ణయం.. మమతా ప్రభుత్వానికి పెద్ద దెబ్బ అనే అభిప్రాయం అయితే రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అయితే ఈ మొత్తం ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర భర్తీ పక్రియ మళ్లీ తాజాగా నిర్వహించాలని సూచించింది. ఇక ఈ పక్రియ అంతా పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ జరగాలని ఆ ఆదేశాల్లో ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక 2016లో ఎయిడ్ స్కూళ్లలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతరుల భర్తీకి రాష్ట ప్రభుత్వం స్టేట్ లెవెల్ సెలక్షన్ టెస్ట్ నిర్వహించింది. మొత్తం 24,640 ఉపాధ్యాయల పోస్టలకు ఈ పరీక్ష నిర్వహించారు. దీంతో దాదాపు 23 లక్షల మంది ఈ పరీక్షకు హాజరయ్యారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ శ్రీనివాస్ జీ
### -సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ
### - ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగద్దు

జమ్మికుంట ఏప్రిల్ 22 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రం లో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ పరిశీలించారు. జమ్మికుంట మండల పరిధిలో సీఐ రవి సిఐఎస్ఎఫ్ బలగాలతో సమస్యాత్మకమైన గ్రామాలైన సైదాబాద్, కోరపల్లి, విలాసాగర్, తనుగుల,వావిలాల గ్రామాలలో ఎన్నికల నియమావళి లో భాగంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.పోలింగ్ కేంద్రాలలో త్రాగునీటి సౌకర్యం, ఫర్నిచర్స్, ఏర్పాటు చేయాలని, పోలింగ్ బూత్ లలో అన్ని వసతులను సమకూర్చాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని బూత్ స్థాయి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,బూత్ స్థాయి అధికారులకు తదితరులు పాల్గొన్నారు.



# రామ్‌చరణ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది

### బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్



ఆపరేషన్ వాలెంటైన్'తో తెలుగువారికి పరిచయమైన బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులు చేస్తున్న ఆమె .. రామ్‌చరణ్‌ను తాను ఎంతగానో అభిమానిస్తున్నట్లు చెప్పారు. 'చరణ్ అంటే నాకెంతో ఇష్టం. డ్యాన్స్ అద్భుతంగా ఉంటుంది. ఎప్పటి నుంచో ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని అనుకుంటున్నా. నా తదుపరి తెలుగు సినిమా ఆయనతోనే ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'బడే మియా ఛోటే మియా' కోసం వయసులో తనకంటే 30 ఏళ్లు పెద్దవాడైన అక్షయ్ కుమార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ఆమె స్పందించారు. 'ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. వయసులో పెద్దవారైన పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించడానికి నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే, స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్నప్పుడు ఎక్కువ మంది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించవచ్చు. అక్షయ్ కుమార్ సూపర్ స్టార్. ఆయనతో వర్క్ చేయడాన్ని నేనెంతగానో ఎంజాయ్ చేశా. ఎంతోమంది ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలను కుంటారు. కొంతమందికి మాత్రమే ఆ అవకాశం లభిస్తుంది. తమ చిత్రాల్లోకి నటీనటులుగా ఎవరిని తీసుకోవాలనేది పూర్తిగా దర్శకుల నిర్ణయం. కాబట్టి దాని గురించి నేను పెద్దగా మాట్లాడాలనుకోవడం లేదు. అగ్ర నటులతోనే కాకుండా యువ హీరోల చిత్రాల్లోనూ నటించాలనుకుంటున్నా' అని ఆమె తెలిపారు. 2017లో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్నారు మానుషి చిల్లర్. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'సామ్రాట్ పృథ్వీరాజ్'తో ఆమె తెరంగేట్రం చేశారు. 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ', 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాల్లో నటించారు. సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'కబీర్ సింగ్'లో హీరోయిన్‌గా తొలుత తనకే అవకాశం వచ్చిందని.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ వదులుకున్నట్లు తెలిపారు.

# రజనీ చిత్రం ఫస్ట్ లుక్ పై భారీ స్పందన



సూపర్‌స్టార్ రజనీకాంత్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో ఒక చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. రజనీ 171 వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఇప్పటికే ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ విడుదల చేయగా, రజనీకాంత్ అభిమానులతో పాటు ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను రాబట్టుకుంది. సినిమా టైటిల్‌ను విడుదల చేయనున్నట్లు లోకేశ్ తన సోషల్ మీడియాలో తెలపడంతో నెట్టింట ఇప్పుడు ఈ వార్త బాగా హల్‌చల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో కింగ్ నాగార్జున కీలక పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌కు వచ్చి నాగార్జునకు స్టోరీ చెప్పడం, అది నచ్చి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో న్యూస్ చక్కర్లు కొడుతోంది. దీంతో మునుపెన్నడు చూడని మల్టీస్టారర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇప్పటికే రానా, దల్కర్ సల్మాన్ ఇందులో కనిపించబోతున్నట్లు తెలుస్తుండగా ఇటీవలే సీనియర్ నటి శోభన, శృతిహసన్ కూడా ఈ చిత్రంలో భాగమవుతునట్లు వార్తలు వినిపిస్తుండడంతో ఈ సినిమాపై రోజురోజుకు అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. కాగా నాగార్జున తాజాగా ధనుష్ హీరోగా రూపొందుతున్న కుబేరా సినిమాలోనూ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. అయితే.. ఈ చిత్రం టైమ్ ట్రావెల్ కథ అని కొందరు, లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ చిత్రాలలోని రోలెక్స్‌కు రిలేటెడ్‌గా ఈ సినిమా ఉండబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాకు తంగమ్ అనే పేర్కు ÷నైల్ చేసినట్లు తెలుస్తోండగా జూన్‌లో ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లి ఈ ఏడాది చివరకు సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-టాన్ చేస్తున్నారు. అన్బరివు స్టంట్స్, అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. దీని తర్వాత 'ఖైదీ 2' మొదలు పెట్టనున్నట్లు గతంలో ఓ ఇంటర్వ్యూలో లోకేష్ తెలిపాడు. రజనీకాంత్ నటించిన తాజా చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది.

# శరవేగంగా విశ్వంభర షూటింగ్
### సంక్రాంతికి విడుదల చేసేలా ప్లాన్



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర' శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. 'భారీ సెట్‌లో యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ పూర్తయింది. 26 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో ఇంటర్వెల్ ఫైటింగ్ సీన్స్‌ను చిత్రీకరించారు. ఇందుకోసం 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని రూపొందించారు. ఈ సన్నివేశం సినిమాకే అదనపు ఆకర్షణ కానుంది. యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్ లక్ష్మణ్ పర్యవేక్షణలో దీన్ని చిత్రీకరించారు. హైలెవెల్ వీఎఫ్ఎక్స్‌లతో ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు' అని సినీ వర్గాల వెల్లడించాయి. ఇటీవల హనుమాన్ విగ్రహం వద్ద చిరు దిగిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో వైరలైన సంగతి తెలిసిందే. ఇది సినిమాలో ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. సోషియో ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న 'విశ్వంభర' వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది. 18 ఏళ్ల తర్వాత చిరు-త్రిష ఈ సినిమా కోసం కలిసి నటిస్తుండడంతో దానిపై అభిమానుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యమిస్తూ రూపొందిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు. దాదాపు రూ.200 కోట్ల భారీ బ్జడెట్‌తో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు టాక్. చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక బ్జడెట్‌తో రూపొందుతున్న సినిమాగా ఇది నిలవనుంది. ఇక దీనిలో త్రిష ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు టాక్. ఆమెతో పాటు సురభి, ఇషాచావ్లా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# శబరి నుంచి ..
## నా చెయ్యి పట్టుకోవే పాట విడుదల



వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'శబరి తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న సినిమా విడుదల అవుతోంది. ఈ చిత్రాన్ని మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించగా అనిల్ కాట్జ్ దర్శకత్వం వహించారు. చిత్రం దిడుదల దగ్గర పడుతుండడంతో ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేశారు. తాజాగా 'నా చెయ్యి పట్టుకోవే అంటూ సాగే పాటను విడుదల చేశారు. అయితే.. 'శబరి'ని పాన్ ఇండియా రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఈ పాటను సైతం తెలుగుతో పాటు హిందీ, కన్నడ, తమిళం, మలయాళం... ఐదు భాషల్లో విడుదల చేశారు. 'శబరి'కి గోపీసుందర్ సంగీతం అందించారు. ఆయన స్వరపరిచిన బాణీకి తెలుగులో రహమాన్ సాహిత్యం అందించారు. ఈ పాటను అమృతా సురేష్ పాడగా 'శబరి మ్యూజిక్' ఛానల్ ద్వారా సాంగ్ విడుదలైంది. సినిమాలో వరలక్ష్మీ శరత్ కుమార్ కుమార్తెగా నటించిన నివేక్షపై కొడైకెనాల్ కొండల్లో అందమైన ప్రదేశాల్లో ఈ పాటను తెరకెక్కించారు. తల్లీ కూతుళ్లు ఇద్దరూ విహార యాత్రకు వెళ్లే సమయంలో పాట వస్తుందని విజువల్స్ చూస్తుంటే అర్థం అవుతోంది. నా చెయ్యి పట్టుకోవే...' సాంగ్ విడుదలైన సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ... 'ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందన్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్ నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉండబోతోందని.. తల్లిగా ఆమె నటించిన తీరు, కుమార్తె కోసం పడే తపన ప్రతి ఒక్కరినీ కదిలిస్తుందన్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్ తొలిసారి ఓ ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమా చేశారని. తల్లీ కుమార్తె మధ్య సన్నివేశాలు అందర్నీ ఆకట్టుకుంటయ్యాన్నారు. కథలో కీలకమైన సందర్భంలో ఈ సాంగ్ వస్తుంది. భావోద్వేగాలతో కూడిన సైకలాజికల్ థ్రిల్లర్ ఇది. మే 3న పాన్ ఇండియా స్థాయిలో భారీ ఎత్తున విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు.

